"ఎల్లోరాలో ఏకాంతసేవ"

రైలు కదలడానికి ఇంకా అరగంటుంది. ఎలిఫెంటా గుహలో ఉదయం చూసిన త్రిమూర్తి శిలా విగ్రహాన్ని గురించి ఆలోచించడం మానేసి, పక్కా సర్దుకుంది జ్ఞానసుందరి. శిలా ప్రతిమ చాలా ఎత్తైనది; మధ్య బీటవే సినా అందంగానే వుంది. అందం కాదు—చూస్తున్నంతసేపూ ఎంతో ప్రశాంతంగా వుంది. ఆ మూర్తి పాదాల పైన పడి నమస్కరించా లనిపించింది. స్నేహితురాండ్రు నవ్వుతారేమోనని ఆపని చెయ్యలేదు. ఆ సావిత్రి మరీనూ—వొకటే విరగబడి నవ్వడం....వాళ్ళంతా ఏరీ? ఇంకా ప్లాట్‌ఫారంమీద పచార్లు చేస్తున్నారు. మరో పది నిమిషాలు టైముంది. చెల్లెలు నాగ రాజ్యలక్ష్మి వ్రాసిన ఆ ఉత్తరం మళ్ళా గబగబ చదివి తలగడకింద పెట్టేసింది. జ్ఞానసుందరి.

చటుక్కున ఆమె కో విషయం స్ఫురించింది. ఆ త్రిమూర్తి ప్రతిమ పెద్దమెడ, కనుబొమ్మలు, మొత్తం వైఖరి ఎవరిలోనో చూసిన ట్లనిపించింది. ఇం కెవరు? మధుసూదనం. చెల్లెలు భర్త. అంత పెద్దమెడ, పెద్ద కనుబొమ్మలు ఏం బాగుంటాయి! మధు అంటె తనకి గిట్టదు. ఆ రాతి విగ్రహం ఛాతీపైన వెంట్రుకలు లేవు. మధుకి అంతే. మొగాడికల్లావుంటే ఏం బాగుంటుంది? మరి త్రిమూర్తి విగ్రహం తన కెందుకంత బావుంది? అట్లాంటివన్నీ పెద్దబొమ్మల్లో, పెద్ద ప్రతిమల్లో బాగుంటాయి కాబోలు!

"ఇట్లా రా, మూడు మొహాల మనిషిని చూపిస్తా" అంది గంగూబాయి. చివాలున తలుపు తోసుకొచ్చి. జ్ఞానసుందరి అదిరి పడింది. కిటికీలోంచి తలకాయ బైటపెట్టి ప్లాట్ ఫారంకేసి చూపింది.

"ఏమోనని హడలిపోయ్యాను, కొంచెం మెల్లగా చెప్ప రాదు?"

దూరంగా వో మనిషికేసి చూపించి గంగుబాయి నవ్వుతోంది.

"ఎవ రది? నా కేం కనిపించడంలే."

"కండ్లజోడు పెట్టుకో ....ఇంకనైనా—వో వయ్యారిభామా ...." అంటూ గంగు నాట్యభంగిమంలాంటిది ప్రదర్శించి, మళ్ళా ప్లాట్ ఫారంమీదికి నడిచింది.

ఉత్తపుణ్యానికి నవ్వేవారిని చూస్తే ఆమెకి తలనొప్పి. అయినా, తను వారి చేష్టలకి కోపగించుకో కూడదు. వినోదించ డానికికదా, వారందరూ ఉత్తరదేశ యాత్రకి బైలుదేరుత. తను వాళ్ళంత చదువుకోలేదు. వాళ్ళకి ఎక్కువతెలుసు—అందుచేతఎక్కువగా వినోదించి, ఎక్కువ నవ్వుతారేమో. వాళ్ళతోకూడా కలిసి యాత్ర చేసి రమ్మని తనని ప్రయాణం కట్టింది, అన్నయ్య 'ముఖ్యప్రాణ్'. వాళ్ళతో కలిసి వచ్చినందుకు తనకేం విచారంలేదు. వారి సరదాలతో, షికార్లతో చాలా కులాసాగా గడిచిపోయ్యాయి రోజులు కాని ఆ ఉదయమే. త్రిమూర్తిని చూపి లాడ్జికి చేరుకోగానే, చెల్లెలు ఉత్తరం చదవడంతో మనోవ్యాకులత ప్రారంభమైంది. ఆ ఉత్త రంలో సంగతులు పిచ్చివరితోనూ చెప్పడానికి లేదు. బెంగ, బాధ, సందేహాలు అన్నీ లోలోన పడాల్సిందే. ఏయే తేదీల్లో ఏయే వూళ్ళల్లో వుంటారో, అన్నీ చెల్లెలికి అన్నయ్యకి తెలుసు. చూసిన వింతలు, విశేషాలను గురించి తను వారికి వ్రాస్తూనేవుంది. వారివద్ద నుండికూడా ఇంటిదగ్గర వార్తలు అందుతూనే వున్నాయి. ఆ ఉదయం వొచ్చిన ఉత్తరంలో వివరాలు లేవు.

మధుసూదనం ఏ ఊరో కాంప్ వెళ్ళాడుట, నాలుగు రోజుల్లో వొస్తానని, వారం గడిచింది; అతను తిరిగి రాలేదుట. అతనితో కలిసి కాంప్ వెళ్ళిన వొకరిద్దరు, అతన్ని గురించి భోగట్టా ఏమీ చెప్పలేక

పొయ్యారుట. ఏదో కొండమీది రాళ్ళని చూసొస్తానని వెళ్ళాడుట. అంతే. మళ్ళీ కనబడలేదు. నాలుగురోజు లైంతర్వాత. స్వంత పనులు చూసుకునే నిమిత్తం వోనెల సెలవు యివ్వవలసిందిగా ఆఫీసుకి సెలవుచీటి చేరింది. అత నెక్కడికి వెళ్ళింది. ఏమైంది. జాడ తెలీక చెల్లెలు బెంగెట్టుకుంది. కలకత్తాలో ఉద్యోగం చేస్తున్న అన్న ముఖ్యప్రాణ్‌కి యీ విషయం వ్రాసింది. ఆరాలు తీసి మధుసూదనం ఎక్కడున్నా ఇంటికి తీసుకొచ్చే భారం నాదని హామీ యిస్తూ వ్రాసిన ఉత్తరంవల్ల చెల్లెలికి కాస్తంత ధైర్య కలిగిందిట. కూతురు మధురభక్తి నాన్నకోసం బెంగెట్టుకుందిట. తనని వెంటనే రమ్మంటుంది. అదీ ఉత్తరం.

స్నేహితురాంధ్ర బృందం వొచ్చిపడ్డారు. వాళ్ళొస్తే ఆలోచించుకునేందుకు వ్యవధి కుదరదు. ఏవో కబుర్లు పెడతారు. అందు చేత నిద్రపోతోన్నట్లు కళ్ళు మూసుకుని పడుకుంది, జ్ఞానసుందరి.

రైలు కదిలింది. వాళ్ల నవ్వులు, కబుర్లు. నొకర్ని వొకరు తోసుకోడాలు - పరాచికాలు. వాళ్ళని విసుక్కోకూడదు. వాళ్ళంతా పెళ్ళికాని పిల్లలు. వారి ఉత్సాహం, సంతోషం. తనకీ ఎంతో ఉత్సాహాన్ని, సంతోషాన్ని కలగచేశాయి. తనకి చిన్నతనంలోనే వైధవ్యం ప్రాప్తించింది. తన కర్మ తాను అభవించాలిగాని, చుట్టుపక్కల వాళ్ళని చీదరించుకుని, మూతి బిగింపులతో వారి ఆనందాన్ని పాడు చెయ్యడం ఏమంత బాగుంటుంది? తన వయస్సు ముప్ఫై— వాళ్ళంతా కనకంటె పదేళ్లు చిన్న. కాని అస్తమానూ. సంతోషంగా. హుషారుగా వుండటం తనకి చేతకాలేదు, కాసేపు అల్లా వుండ గలదు. మళ్ళీ కాసేపు, వొంటరిగా ఆలోచించుకుంటూ, దిగులుగా వున్నట్లు వుండడంకూడా, ఆమెకి అలవాటైన వొక వింత అనుభవం.

నాగరాజ్యలక్ష్మి తనని వెంటనే ఇంటికి రమ్మంటుంది, తను వెళ్ళి చేసే దేమిటి? ఓదార్పు. ఏమని ఓదార్చడం? 'పోతే పొయ్యాడు లే. పీడ విరగడైంది' అనబుద్దేస్తుంది. అట్లాగంటే క్షమిస్తుందా? భర్త లోటుపాట్లన్నీ తను పదిమందిలోనూ యొకరువు పెట్టొచ్చు గాని. మరెవరైనా కాస్త ఆక్షేపించారంటే మండిపడుతుంద 'నాగులు'.

భర్త పూర్తిగా తనవాడు. ఆ ఇల్లూ, అందులో వస్తువులూ, అమ్మాయి 'మధురం'—అంతా తనకి చెందిన సొత్తు. నుంచోమంటే నుంచోవాలి. కూర్చోమంటే కూచోవాలి. స్త్రీని ఆట వొస్తువుగా, ఆస్తిలో ఒక భాగంగా. బానిసగా వాడుకుంటున్నారు యీ మొగాళ్ళంతా అంటూంటారుగాని, వీళ్ళెవరికీ అసలు విషయం తెలీదు. స్త్రీయే పురుషుణ్ణి పెద్దహాల్లో మధ్య బల్లమీద పూల తొట్టిలాగా చూచుకుంటుందని ఎవరూ పైకనరేం? ఆ తొట్టిలో రోజూ కొత్తకొత్త పూలుపెట్టి వాసన చూసుకుంటూ,—హాల్లో చోటులేక బల్ల జరిపినప్పుడు, ఆ పూల తొట్టిని దూరంగా దొడ్లో పడెయ్యడం జరుగుతూ వుంటుంది. ఎప్పుడైనా కోపంవస్తే దాన్ని నేలకేసి కొట్టడం—అది ముక్కలవడం, కోపం తగ్గింతర్వాత, మళ్ళీ అతికించి దుమ్మంతా దులపడం. డబ్బున్న స్త్రీ కొత్త తొట్టిని కొనుక్కుంటుంది!

కళ్లు మూసుకున్న జ్ఞానసుందరి పెదవులు నవ్వుతో వొంకర తిరిగి మళ్ళా సర్దుకున్నాయి. ఏడాదిలో రెండుమూడు నెలలు చెల్లెలిగారింట్లో గడిపినప్పుడు తాను చూసినవాటినిబట్టి, అట్లాంటి అభిప్రాయం ఏర్పడింది. మిగతరోజులు కలకత్తాలో అన్నగారిదగ్గర గడుపుతుంది. అక్కడ మరోలా వుందా? లేదు. అక్కడా అంతే- భార్య ఎంతచెబితే అంత అన్నయ్య. హడలు. ఇంట్లో రోజూ ఎవరో ఓ గెస్టుని తెస్తూ వుంటాడు. ఆవిడ మండిపడుతుంది. ఎప్పుడూ తనముందు కూర్చోమంటుంది. అతిథివున్నప్పుడు తనని గదమాయించే అవకాశం లేదుగనుక, ఎవళ్ళోవొకళ్ళు పరాయివ్యక్తి ఇంట్లో వుంటూండడం మంచిదమ్మా చెల్లాయి, అంటాడు అన్నయ్య. మధుసూదనం వో నెలరోజులైనా యీ గొడవలోంచి పారిపోయి. ఏకాంతంగా, స్వేచ్ఛగా గడపాలని ఎక్కడికో—ఎవరితోనో పోయుంటాడు. ఎవరితోనో పోతాడా? ఎందుకు పోడు? అతన్ని గురించి అంత మంచిగా చెప్పుకోరు: చిన్నతనం వేషాలు వేస్తూంటాడుట. వాళ్ళూ వీళ్ళూ అన్నా రనడం ఎందుకూ, తనకి తెలీదు? ఇంట్లో వంటకి ఆడ మనిషటం ప్రమాదం. పనికి పడుచుపిల్ల నెట్టు

కోవడం ప్రమాదం. మగాళ్ళేమిటో చిత్రంగా ఉంటారు. అన్నయ్య
కూడా అంతే. వాళ్లాఫీసులో టెలిఫోన్ అమ్మాయి ఎవరో
దానితో స్నేహం కుదిరిందిట—షికార్లు, సినిమాలు. వ్యవహా
ముదురుతోందని తెలియగానే ఆ అమ్మాయిని మరో చోటికి
చెయ్యడం.—ఏవేవో గొడవలు జరిగినట్లు చెప్పుకున్నారు.

మరిది మధుసూదనం అంటే తనకి భయం. ఎందుకో?
ఏమంత బాగుండడు. చామనచాయ, పెద్ద గుండ్రటి మెడ—
దట్టంగా అర్ధచంద్రాకారం కనుబొమ్మలు—ఆకాశం అంతా
వుండి, ఆ మధ్య నల్లటి అర్ధచంద్రుడుంటే ఎట్లా వుంటుందో
వుంటుంది. ఆ క్రాపింగ్‌కి నూని పట్టించడు. ఇన్ని నీళ్ళతో
చేత్తో నొక్కుతాడు. తల దువ్వుకోడు—దుబ్బులా పెరిగిపో
వుంగరాలజుట్టు. పొట్టిముక్కు—చిన్ననోరు. అందులో మా
పట్టనట్లుగా—మౌనంగా వుంటాడు. అప్పుడే నవ్వు మానేసినట్లుగా
వుంటుంది అతనినోరు. అతనిచేతులూ, ముఖ్యంగా వేళ్ళు స్వరూ
తల్చుకుంటే భయమేస్తుంది—సన్నగా. పొడుగ్గా—సన్నములక
డలా, కణుపులు స్పష్టంగా కనబడుతూ, చుట్టబెట్టడానికి సిద్ధంగా
నట్లుగా వుంటాయి. వేళ్ళతో 'కబళింపు'—అంతే అవేగుర్తొస్తా
తన కింకా జ్ఞాపకం, రెండేళ్ళక్రితం అతనూ, 'నాగులు' తనూ కొం
కెళ్ళారు. బంగళాలో బస; సాయంత్రం కొండవైపు నడుచుకుం
వెళ్లారు. అక్కడ రాళ్ళు తవ్వి పోగుచేస్తున్నారు. తనూ, చెల్లెలు
నీడలో కూర్చున్నారు. రమ్మని సంజ్ఞచేశాడు—తననో చెల్లెలినో
తెలీదు. 'నిన్నేనే' అందినాగులు. 'నే నెందుకు—నువ్వే వెళ్ళు'
అంది తాను.

“నే చూసినవే లెద్దు—యీ రాళ్ళు రప్పలు—నిన్నే
పిలుస్తుంట” అన్నది నాగులు.

ఆఖరుకి తనే వెళ్ళింది. చీకటిపడుతోంది. తమ నీడలు
రాతినేలమీద పొడుగ్గా పడుతున్నాయి, అతను ముందు నడుస్తున్నా
తను వెనక. మరో రాళ్ళగుట్టదగ్గరకి చేరుకున్నారు. అతను రెం
డుగులు లోతుగల నేలలో దిగి, చెవి రాయికి ఆనించి వింటున్నా

''ఏమి టది?''

''వినండి'' అంటూ ఆ వేళ్ళతో తన మెడని బిగించి, తలని నేలమీదికి వొంచి, చెవి రాతికి ఆనించాడు.

"ఏమీ వినబడటం లేదూ?"

ఏం వినబడాలి?'' అంది తను.

''ఈ రాయివయస్సు ఎనభై వేల సంవత్సరాలు. చూడండి, యీ చాలలు—వొక్కొకచాలు పదివేల సంవత్సరాల కాలం జరిగి పోయినట్లు చూపెడుతుంది, నుదుటిమీద గీతలు మనిషి వయస్సు చూపెట్టినట్లుగా. మానవ చరిత్ర ప్రారంభానికిముందే ఎన్నోవేల సంవత్సరాలుగా వింతమృగాలు తిరుగాడిన గాథను చూచింది యీ రాయి. ఏ నేలజంతువో యీ రాళ్ళమధ్యపడి చచ్చింది. దాని కళే బరం గుర్తులు యుగయుగాలుగా అల్లానే వుండిపోతాయి, ఆ ఎముకలు పొడుమై రాతిలో జీర్ణించిపోతాయి. మనిషికిముందు యీ భూమిమీద జరిగిన ప్రాణుల నాటకం. చరిత్ర, అంతా యీ రాయిలో చూస్తాం, వింటాం. ఏ వింతమృగమో భూకంపంలో కూలిన రాళ్ళ మధ్య నలిగి చచ్చిపొయ్యేముందు చేసిన ఘోష, మరణ వేదన, యీ రాతిలో వినబడుతుంది.'' అని మధుసూదనం. తన మెడలేవకుండా, వేళ్ళతో చెవిమీదిజుట్టుని కదుపుతూ, చెంపమీదికి వుంగరం వ్రేలిని ప్రసరింపజేస్తూ తన శరీరాన్ని స్పృశించినప్పుడు తనలో రేగిన యావగింపు యిప్పటి కింకా అల్లా నిలిచిపోయింది.

''నా కేమీ వినబడటం లేదు.'' అన్నది తాను. తనని లేవ దియ్యబోయినట్లుగా, చేతిని తన గుప్పిటలో నొక్కిపెట్టి, వొక్కసారి బలంగా పైకి లాగాడు.

మరోసారి మరోటి జరిగింది. తను స్నానంచేసి చీర కట్టు కుంటూవుండగా తలుపు తోసి లోపలి కొచ్చి—

''మీరా. నాగు అనుకున్నా'' అంటూ వెళ్ళాడు.

త నేదో పత్రిక చదువుకుంటూ కుర్చీలో కూర్చుంది— ఎవరివో వేళ్ళు తన తలమీద పడి, జుట్టుని రేపుతున్నట్లయింది— వెనక్కి తిరిగిచూ స్తే మధుసూధనం.

"మీరా—అదేమో ననుకున్నాను" అన్నాడు. ఇవన్నీ నిజంగా జరిగిన పొరబాట్లేనా—చెయ్యాలని చేసినవా? తనకి తెలీదు.

కార్లో కూర్చున్నప్పుడు, ఏదో వొంకవి తెలీక జరిగినట్లు అతనిచెయ్యి తనబుజంమీదనో, నడుంమీదనో వేసి తీరతాడు. తను కోపంగా చూస్తుంది—జాలిగా, దిగులుగా, 'క్షమించండి' అన్నట్లుగా చూస్తాడు. ఏమిటి చెయ్యడం? నాగులుతో చెబితే? ఏమిటి ప్రయోజనం దానివల్ల? మళ్ళీ మాట్లాడేటప్పుడు తనని 'అండి' అని సంబోధిస్తాడు. భలేవాడు! బాగోగులు తెలీవా, మంచిచెడ్డలు లేవా? అభం శుభం వుండొద్దా—రాళ్ళు పరిశోధించే ఉద్యోగం—జియాలజిస్టు—రాతిబొమ్మలా వుంటాడు. రాతిగుండె. తగిన ఉద్యోగమే లభించింది.

మాట్లాడుతూ మధ్యలో నిలిచిపోయి, తన కళ్ళల్లోకి తేరిపార చూస్తూంటాడు. తనకి అది చాలా బాధగా వుంటుంది. అతనిదృష్టిని తన కళ్ళనుండి మరల్చి, పమిటికేసి ప్రసరింపజేస్తాడు. తనకి సిగ్గేసి అక్కడనుండి వెళ్ళిపోతుంది.

జ్ఞానసుందరి ఆ సిగ్గుని జ్ఞాపకం తెచ్చుకుని పమిటి బాగా సర్దుకుని, దుప్పటి రొమ్ములపైకి లాక్కుని, చేతులు గుండెమీద బిగించి పడుకుంది. చేతిమీది వాచ్ కేసి చూసుకుంది. నల్లటి డయల్ పై ఎర్రటి అంకెలుగల రిస్టువాచ్—మధుసూదనం పుట్టినరోజునాడు భార్య కిచ్చినది తనని పెట్టుకెళ్ళమంది. చెల్లెలు అప్పుడప్పుడు తను పెట్టుకునేది. ఓ రోజున తను కిటికీలోంచి చూస్తూ నిలబడింది. మధుసూదనం ఆ గదిలోకొచ్చి తనచేతిని పట్టుకుని టైముకోసం వాచిని చూసినట్లుగా చెయ్యి వేళ్ళతో బిగించాడు. తను విసుగుతో విదలించుకుని బైటకొచ్చేసింది. ఇట్లాంటికి జరిగినప్పుడల్లా తనేదో సాకు చెప్పి, కలకత్తా అన్న దగ్గరకు ప్రయాణంకట్టి వెళ్ళేది. తనకి భర్త లేకపోవడంబట్టేగా యింత చౌలవగా ప్రవర్తించడం! తనకి మళ్ళా పెండ్లిచెయ్యాలని ఎందరో ప్రయత్నించేశారు. అన్న పట్టుదలతో తిరిగి సంబంధాలు చూశాడు. మధుసూధనం 'చేసుకోండ'ని సలహాలిస్తూ వొచ్చాడు. తనని స్కూలులో చేర్పించారు. అక్కడ

మొగపిల్లలు గోడలమీద వ్రాతలు వ్రాయడం, ఉత్తరాలు వ్రాయడం, ఏవో గొడవలు జరిగితే భరించలేక తను చదువు మానేసింది. కొంత కాలం ఇంట్లో వీణ చెప్పించారు. తనకి సంగీతం అబ్బింది కాదు— సంబంధాలు కుదరలేదు. తనదృష్టి ఏ పురుషుడిపైనా పడలేదు. జనార్ధనం పద్యాలు వ్రాసేవాడు. కొంతకాలం స్నేహంగా వుండేవాడు. తర్వాత రఘురామయ్య బాగా చదువుకున్నవాడు, తనని ఆదరణతో చూసేవాడు. ఇప్పు డవన్నీ తల్చుకుంటే బెంగగా వుంటుంది. ఏదో సిగ్గు, భయం, న్యూనత. బాల్యం, పెళ్ళి, భర్త అవన్నీ తల్చుకుంటూ, ఆ దిగులు, ప్రపంచంతో పంచుకోకుండా తనలో దాచేసుకుని ఏకాంతంగా గడపడమే తనకి బాగుంది. కలకత్తాలో స్త్రీల సంక్షేమ బృందంతో కలిసి, దగ్గరలో వున్న పల్లెటూళ్ళకి వెళ్ళి, అక్కడి వారి ఇల్లు వాకిలి పరిశుభ్రం చెయ్యడం, కుటీర పరిశ్రమలకి తోడ్పడడం మొదలైన సంక్షేమ కార్యకలాపంలో తనబాధ మరిచిపోతుంది.

పదకొండైంది. లైట్లు ఆర్పేసి అంతా నిద్రపోతున్నారు. లైటువేసి తలగడకింద దాచిన చెల్లెలు ఉత్తరం తీసి చదవడం మొదలెట్టింది జ్ఞానసుందరి. ఆ వాక్యాలు సరిగ్గా చదివితే, ఏదేనా కొత్త అర్థం స్ఫురిస్తుందేమోనన్న ఆశతో. ఎక్కడికి వెళ్తుంటాడో తను ఊహించగలదా? ఎందుకు వెళ్ళుంటాడో తనకి తోచినకారణానికి ఆ ఉత్తరంలో ఆధారా లేమైనా వున్నాయా? చారుమతి చటుక్కున లేచి ఆ దీపం కాస్తా ఆర్పేసింది. పోనీ ప్రొద్దున్నే చదవొచ్చు. మళ్ళా దుప్పటికప్పుకుని పడుకుంది జ్ఞానసుందరి. రైలు వొక క్రమంతో వేగంగా నడుస్తోంది. యాత్రకి బైలుదేరిన విద్యార్థినుల బృందానికి యజమాని షీలా లాజరస్. పెద్దదామె. నెమ్మదైంది. అనుభవంగలది. ఆమెతో చెల్లెలికి ఇబ్బిగా వుందని సాకుచెప్పి తను తిన్నగా ఇంటికి వెళ్ళడానికి నిర్ణయించుకుంది. విచారంకూడా వో రకమైన అర్పిగా— మానసిక మైంది. ఆమె ఎన్నోపుణ్యక్షేత్రాలు, ప్రసిద్ధమైన కట్టడాలు, చారిత్రకస్థలాలు చూపింది యీ యాత్రలో. అన్నీ వొకలాగే వున్నాయి. వాటినిచూస్తే భయమేస్తుంది. అంతంత

పెద్ద సౌధాలు. శిలా ప్రతిమలు ఎందుకు నిర్మించారో పూర్వం వాళ్లు? ఏది చేసినా భారీకృషి. పూర్వం వాళ్ళు యిప్పటి వారికంటె ఎత్తుగా, లావుగా వుండేవారా? తనకి తెలీదు. క్రితంసంవత్సరం గుంటూరులో బంధువులపెండ్లికి వెళ్ళినప్పుడు, తనూ, నాగులు, మధుసూదనం మరికొందరు పెండ్లివారితాలూకు అమరావతిలో స్తూపాలు, చెక్కడాలు చూసివొచ్చారు. తిరిగి తిరిగి అలిసి తనో మూల స్తంభంవెనక బండమీద కూలబడింది మిగతా వాళ్ళు ముందుకిసాగిపొయ్యారు. ఓ పావుగంటకి మధుసూదనం వచ్చి మంచి చిత్రం చూపిస్తాను రమ్మని బుజంమీద చెయ్యివేసి లేవదీశాడు. తను విదిలించేసింది. ఏం పన్లవి? అక్కడ ఓ స్త్రీవిగ్రహం ముందు నిలబడ్డాడు. ఆ బొమ్మ స్తనాలమధ్య చెవి ఆనించాడు.

"ఏంపన్లవి" అని మందలించింది తాను.

"ఇది ఎర్రరాయి—రెడ్ స్టోన్. రక్తమాంసాలుగల స్త్రీమూర్తి ఇది. ఆ చీరలేకుంటే మీ రిట్లాగే వుంటారు?" అని మళ్ళీ అతని చూపు తన రొమ్ములమీదికి, నడుంపైపుకీ మరల్చాడు. తను వెనక్కి తిరిగిపోయింది.

"ఇప్పుడు మరీ అచ్చంగా ఇల్లాగే వుంటారు."

"ఊరుకో."

"ఈవిగ్రహం వెనక చరిత్రలో ప్రేమకోసం విలపించిన స్త్రీరోదన వినబడుతోంది. లోపల వాత్తిడికి తట్టుకోలేక రక్తం చర్మంపైన చిందినట్లు చిత్రించాలని ఎర్రరాయి వాడారు, అమరావతీ శిల్పులు. అమరులు."

"ఇదంతా నాకెందుకు చెబుతావు?"

"మీరు వినరుగనక"

నవ్వుని బలవంతాన ఆపుకుంది తాను. ఆ మనిషినోటికి శుద్దీబద్దీలేదు—నైతికచింతనే వున్నట్లు లేదు.

"నాగులుతో చెప్పనా?"

"ఎందు కంత కఠినశిక్ష?"

"మరేంమ్మాటలవి?"

"కాసేపైనా మన నిజస్వరూపాలు బైటపెట్టుకునే అవకాశాలు కల్పించడమే యీ కళాఖండాల ప్రయోజనం."

"మంచివాడివే."

"కాసేపు ఆ మంచిచెడ్డల ప్రస్తావన మాన్పించలేకపోయిందంటే ఈ అమరావతీ శిల్పులసృష్టి వృథా."

తాను వెళ్ళిపోయింది. వెనకాల నడుస్తున్నాడు. తనకి ఆయాసంగా వుంది.

"ఆయాసంగా వుందా?"

"అదే సర్దుకుంటుంది. నువ్వెళ్ళు."

"తీసుకెళ్ళనా?" నడుంచుట్టూ చేతులు బిగించబొయ్యాడు—తోసేసి వెనక్కి తిరిగింది.

"వొద్దు — నువ్వెళ్ళిపో — లేకుంటే కోపంవస్తుంది. ఇంకెప్పుడూ మీవూరికి రాను, ఇట్లా చేశావంటే - కలకత్తాలో వుండిపోతాను."

"ఆ శిలైనా కరుగుతుంది—మీరు మాత్రం...."

తాను గబగబ నడిచి వెడుతోంది. అతను నిట్టూర్చినట్లనిపించింది. వెనక్కి తిరిగి చూడలేదు.

జ్ఞానసుందరికి నిద్రపట్టేసింది. బరువుగా గుండెమీద ఎవరో రాతిచెయ్యిని అనించినట్లయి. పక్కకి తిరిగింది. తాను కదిలిపోతోంది. రైలు నడకతో లయకల్పుతున్నట్లు గుండెలు అదురుతున్నాయి. తనెక్కడికో కిందకి రాతి గుహాంతరాళాలలోకి జారిపోతోంది.

తెల్లవారింది. స్టేషన్‌లో రైలు నిలిచింది. అంతా సామాన్లు సర్ది దిగుతున్నారు. సావిత్రి ఆమెను పక్కమీద నుంచి లేవదీసి, పక్క లుంగచుట్టి ప్లాట్‌ఫారంమీదికి గిరవాపెట్టింది. తనూ దిగింది. పక్కచుట్ట సర్ది లోపల్నించి చెల్లెలి ఉత్తరంతీసి బాగ్‌లో పెట్టుకుంది. అందరూ హోటల్‌కి చేరుకున్నారు. స్నానాలు, ఫలహారాలు అయినాక ముందు ఏది చూడాలో వాదించుకుంటున్నారు. కొందరు ఎల్లోరా గుహలన్నారు. ఇరవై మైళ్ళు - చూసి సాయంత్రానికి తిరిగి రావొచ్చు.

మరి కొందరు అజంతాకి పోదా మన్నారు. రాత్రి అక్కడ గడి
మర్నాడు తిరిగి రావొచ్చు. రాత్రి అజంతాలో గడపడం మంచి
కా దన్నారు. అక్కడ వసతి, తిండి సదుపాయాలు లేవన్నారు.
తిండి, సుఖాలు రోజూ వుండేవే. యీ ఒక్క రాత్రి కష్టపడ
అన్నారు.షీలా లాజరస్ సాయంత్రానికి వచ్చి తీరాలని తీర్మానించిం
అప్పుడే బైలుదేరి, భోజనాలు పట్టుకుపోయి, రాత్రికి తిరిగి వచ్చే
ఏర్పాట్లు చేసుకుని బస్సులో అజంతాకి బైలుదేరారు.

మధ్యలో ఏదో చిన్ననది, అక్కడ బస్సునిలిపి ఆ నది
చూశారు, మళ్లీ కొంతదూరం వెళ్ళాక ఓ వూరు. చుట్టూ పెద్ద గో
బురుజులు. మరోవూరు. దానిపేరు 'అజంతాట,' బొత్తుగా ప
టూరు, అనాగరీకులుగా కనిపించే మనుషులు. రోడ్డు ప్రక్కన క
ఏడుకుంటూన్న ఓ నల్లపిల్లని చూపించి "అదే అజంతా సుందరి"
అని ఆక్షేపిస్తూ నవ్వుతోంది గంగూబాయి.

"సుందరిగారూ, మీకు నల్లరంగువేస్తే అచ్చంగా అజంతా
బొమ్మలా వుంటారు." అన్నది సావిత్రి, సావిత్రి నల్లగావుంటుంది,
గంగుబాయి నలుపు. నల్లవాళ్ళకి, మిగతా అందరూ నల్లగా వుండాల
వుంటుంది కాబోలు!

చారుమతి మాట్లాడుతోంది. ఆమెకూడా నలుపే—మరీ
నలుపు కాకపోయినా,

"బుక్కులో చదివా. ఎర్రరాళ్ళు పొడుంచేసి రేగడి మట్టితో
కలిపి మొదట గోడమీద పూస్తారుట, దానిమీద సున్నం వేస్తారుట,
రంగులకేమో—అక్కడ చెట్ల బెరడు, నార, ఆకులు కలిపి తొక్కి,
కాస్తంత ఆవుపేడకూడా పట్టించగా వొచ్చిన రంగుని పూస్తారట,
ఆవుపేడ నలుపేగా."

షీలా లాజరస్‌కి యీ సంభాషణ నచ్చినట్లులేదు,

"కాసేపటిలో చూడబోతున్నాంగా - వ్యాఖ్యానాలు అప్పుడు
మొదలెడదాం." అని నవ్వుతూనే మందలించింది,

ఎత్తుగా కొండ—దాన్నిండా పెద్దపెద్ద చెట్లు. మలుపుల్లోంచి
పోతోంది బస్సు. అవతల పెద్ద లోయ—అందులోకి దిగుతోంది,

మరో కొండ. తిరిగి తిరిగి కిందికి వచ్చేసింది బస్సు. జనం అలజడి. ఒకటి రెండు టీ దుకాణాలు. వింత దుస్తులతో రకరకాల మనుషులు వొస్తూ వెడుతూ వున్నారు. దూరంగా పావురంగూళ్ళల్లా వున్నాయి అజంతా గుహలు, కుడివైపున చాలా దూరాన వున్నది యాత్రీకుల వసతి గృహంట. పదకొండైంది. ఒంటి గంటవరకూ కొంత చూసి, వసతి గృహంలో భోజనాలుచేసి మళ్ళావొచ్చి మిగత గుహలు చూసి, సాయంత్రం ఏడింటికి తిరుగు ప్రయాణం నిర్ణయించారు.

కొంతదూరం మెట్లమీదుగా నడిచి గుహలకి చేరుకున్నారు. ఎదురుగా వున్నది ఇన్‌హ్యాద్రి కొండలు. దాని దిగువభాగం గుహలుగా దొల్చారట. గుర్రపునాడా ఆకృతిలో వున్నాయి గుహలన్నీ.

ఎదురుగా చిన్ననది—వాఘోరా. చిన్న జలపాతం కూడా వుంది—సత్కుండంట పేరు.

గుహల్లోకి ప్రవేశించారు. లోపలంతా చీకటిగా వుంది. ఎవరో ఒకాయ నొచ్చి గోడమీది చిత్రాలను గురించి చెబుతున్నాడు, ఇంగ్లీషులో, ఉర్దులో. మధ్యమధ్య ఒక పెద్ద డైనమోదీపం చిత్రాలపై ఫోకస్‌చేస్తూ వర్ణిస్తున్నాడు. పదవగుహ అతి ప్రాచీనమైనదిట. శాక్యముని ఆరాధనా చిత్రం తనకి ఆకర్షణీయంగా వుంది. పదహారవది నాగరాజ మందిరం. అందులో చనిపోతున్న ఒక రాకుమార్తె చిత్రం వుంది, ఆ రాకుమార్తెను గురించి ఒక గాథ చెప్పాడు. ఆమెకి సరిగ్గా అర్థం అవలేదు, ఆ రాకుమార్తె పేరు 'సుందరి'ట.

"అందుకే నిన్ను అజంతా సుందరి అంటా....ఎటొచ్చీ నువ్వు మొహానికి కాస్త నల్లరంగు పూసుకోవాలి." అని చారుమతి తనని హేళన చేస్తోంది.

"నీపేరు జ్ఞానసుందరి—పేరుకూడా సరిపోయింది." అంది గంగుబాయి. అందరూ నవ్వారు. వర్ణిస్తున్న వ్యక్తికి ఏమీ అర్థం కాక, ఏదో తెలిసినట్లు తనూ నవ్వుతున్నాడు, జ్ఞానసుందరికి పిగ్గేసింది. తనకి భర్త లేకపోవడంవల్లనేగా వీరందరికీ తనంటే పరిహాసం.

"ఆ రాకుమార్తెకి భర్త వున్నాడాండీ?" అని గైడ్‌ని అడిగింది సావిత్రి.

"ఆమె నందునిసతి. నందుడు సిద్ధార్థుని పినతల్లి కుమారుడు."

"పాపం" అంది చారుమతి. మళ్ళా అందరూ బిగ్గరగా నవ్వారు. జ్ఞానసుందరికి కోపం వచ్చింది—తగినంత కారణం కనబడకపోయినా. ఏదో వినోదించాలిగనక, వీళ్ళంతా తెచ్చి పెట్టుకుని, బలవంతంగా అసహజంగా నవ్వుకుంటూ. అదంతా అనుభవంగా పరిగణిస్తున్నారు. తనకిది నచ్చలేదు.

ఒంటిగంట కావొస్తోంది. బసకి పోదా మన్నారు. జ్ఞానసుందరికి అలసటగా వుంది. ఆకలేస్తోంది. తనింక తిరగలేదు. ఎవరేనా మోపికెళ్లి ఆమెను బస్సులో పడేస్తే బావుండును. లోపలి గాలిలేదు. ఉక్కగా వుంది. చెమట్లు పోస్తున్నాయి. చీరకొంగుతో తుడుచుకుంటోంది. చలికి తెచ్చుకున్న శాలువ మడిచేసి బుజాన వేసుకుంది. వెనక్కి తిరిగి మెల్లగా మెట్లుదిగి బస్సుదగ్గరకి చేరుకుంది. మరో పావుగంటలో మిగతవారంతా వొచ్చారు. బసలోకి వెళ్ళారు. భోజనాలయ్యాక ఓ అరగంట విశ్రాంతిగా కబుర్లు చెప్పుకుని మళ్ళా బైలుదేరారు.

జ్ఞానసుందరి తనకి తలనొప్పి. ఆయాసంగా వుంది. రాలేనంది. తలనొప్పికి ఒక మాత్ర యిచ్చింది సావిత్రి; తను నడిపించి తీసుకెడతానంది చారుమతి. తను రాకపోతే నేనూ వెళ్ళనంది గంగు—

బస్సులో అక్కడిదాకా వచ్చి వూరికే చూస్తూ ఎక్కడో ఓచోట కూర్చోవచ్చు రమ్మంది షీలా లాజరస్. బయలుదేరారు. గుహలదగ్గరకి చేరుకున్నారు. జ్ఞానసుందరి బస్సులో పడుకుంటానంది. మిగతవాళ్ళు లోపలి కెళ్ళారు. కాసేపు కళ్ళు మూసుకుని పరుంది సుందరి. అరగంటైంది. టీ దుకాణం దగ్గరకెళ్ళి కాస్త టీ పుచ్చుకుంది. నది వొడ్డున నడుచుకుంటూ వెళ్లింది. అన్నీ రాళ్ళు. చిన్నవి పెద్దవి—సిమెంట్ రంగువి, ఎర్రవి—చిన్న రాతిగుట్టలు. జలపాతం సన్నధారలుగా, చీర నేతలో మధ్యలో వదిలేస్తే మిగిలిన దారాల జారునేతలా, తిన్నగాపడి రాళ్లమీద నాచుపై చిత్రాలుగీస్తూ, రేకు

మీద వర్షం చినుకులుపడ్డ చప్పుడుచేస్తూ—అదే చప్పుడు, అదే చిత్రాలు—విసుగు కలిగిస్తున్నాయి ఆమెకు.

మరి కొంచెం దూరం నడిచింది. ఐదు దాటింది. చెట్ల వెనక నుంచి సంధ్య వెలుగులో అతిశయోక్తిగా పరిభ్రమిస్తూ వున్న పొడుగాటి నీడలు, పల్చబడి, రాళ్ల రంగుల్ని వెలిగించి, ఆకృతుల్ని మార్చి దిగజారుతున్నాయి. ఆకుల మధ్య కిరణాలు వనదేవత కుట్టుపనిలో సూదులలా వెనక్కీ ముందుకీ కదులుతున్నాయి. గాలి తగ్గింతర్వాత అగ్నిదేవుడు వేసిన గాలిపటం కిందకి పడిపోతూన్నట్లు, నీడలు వెనక్కీ వెనక్కీ వెడుతున్నాయి. ఆ దూరపుకొండ ముసుగు తీసేసినట్లయింది. కొండ మలుపులో పచ్చిక బయళ్ళు-వొస్తూవున్న జుట్టులా కనిపిస్తున్నాయి. కన్ను మెదిపినట్లు సూర్యబింబం గుహల వెనక జారుకుంది. చివరికిరణాలు, అలిసి పరున్న ప్రకృతిని, జలపాతం నీటిని, మేఘాలని, రాళ్ళసమూహాలని, ఒక్కసారి వెన్ను మీద చరిచి లేపినట్లు బంగారం కరిగి, ఎర్రరాళ్ల మొహాన జారిన కుంకుమ బొట్టులా మారి, మందారం మధ్యలో ముదిరిన ఎరుపులో నలుపులా, ఇంద్రజాలికుడు పరికరాల్ని బుట్టలో వేసుకుని వెళ్లిపోతే వీడ్కోలివ్వడం యిష్టంలేక సంధ్యాకాంత ముసుగు బిగతన్నిపరున్నట్లనిపించింది. జ్ఞానసుందరి శాలువా తీసి నెత్తిపైనుంచి, మెడచుట్టూ తిప్పి, బుజాలమీదికి లాగి చేతులు బిగించి కప్పుకుంది. వాళ్ళంతా ఈపాటికి వొచ్చేస్తూ వుంటారు. తనకోసం వెదుకుతూ వుంటారు. కాసేపు వెదికి, కనబడక వెళ్లిపోతారు అంతేగా! వాళ్ళకి తనపై అంతకంటే ఏముంటుంది? ఇక్కడెవ్వరూ లేరు. తనొక్కత్తే — ప్రకృతిలో ఒక భాగం. ప్రకృతి కదలదు. తన గుండెలు బాధతో కొట్టుకుంటూవుంటే, ప్రకృతి చెవులు నిక్కబొడిచి చోద్యంగా వింటూంది. సాయంత్రానికి అలిసినట్లు, నీరు వడితగ్గి, చప్పుడులేకుండా దొర్లుతూ వుంది. నీటికింద రేగడి-మధ్యలో ఎబ్బటిఇసుక-కిందకి దిగింది. ప్రక్కన ఏవో బట్టలు కనిపించాయి. ఎవరో వున్నారు. వెనక్కి వచ్చేసింది. రాతిబండ వెనుకనుంచి ఎవరిదో తల కనిపించింది. వొళ్ళు తుడుచుకోవడం

అయింతర్వాత మొహం కనిపించింది. మరిది మధుసూదనం! ఆశ్చర్యపడింది.

"రండి" అన్నాడు.

గడ్డం పెరిగింది. అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు-కళ్ళ కింద గీట్లు, దుబ్బులా వుంగరాలజుట్టు. గుండ్రని పొట్టిమెడ-వెంట్రుకలు లేని ఛాతీ—సంశయంలేదు, మధుసూదనమే.

"ఇక్కడున్నావా?"

నవ్వుతున్నాడు.

"స్నానం చేస్తారా?"

"ఇంత చల్లోనా?"

"చలిలో చన్నీటిస్నానంలోనే వుంది మజాఅంతా."

"ఇంట్లో చెప్పకుండా వొచ్చావెందుకు?"

"చెబితే రానిస్తుందా, మీకు తెలీదూ?"

"ఉత్తరం వ్రాసింది. మధురభక్తి బెంగపెట్టుకుందిట. నువ్వెక్కడికెళ్ళావో తెలియక చెల్లాయి బాధపడుతోంది."

"ప్రతిప్రాణీ బాధపడాలి. అది సృష్టిలోనే వుంది."

లాల్చీ వేసుకున్నాడు. తువ్వాలుపిండి రాళ్ళమీద ఆరబెడుతున్నాడు. జుట్టు కాడలలాగా నుదుటిమీద, కళ్ళల్లోనూ పడుతోంది. నాగరాజ్యలక్ష్మికి వెంటనే పెళ్ళిగ్రాం యివ్వాలి. మనస్సు వదిలపడుతుంది.

"ఇటు నీళ్ళల్లోకి దిగండి."

కిందకి నీళ్ళల్లోకి దిగింది-ఇసుక నీళ్ళల్లో కనిపిస్తోంది-వింత వింత రంగుల చేపలు పరుగు లెడుతున్నాయి. బట్టలు సంచీలో వేసుకున్నాడు మధుసూదనం.

"ఏయే వూళ్ళు చూశారు. చూసినవింతలు చెప్పండి."

చెబుతోంది. తన మనస్సు వొకచోట, శరీరం మరోచోట వుంది. శరీరం చూసినదాన్ని మనసు చెబుతోన్నట్టు-తనకి వర్ణించడం రాదు! ఏది బాగుందో, ఏది బాగాలేదో చెప్పలేదు. యాత్రలో

చూపిన దృశ్యాలకి తనమీద ఏ ప్రభావమూ లేకపోవడం ఒక్కటే విశేషం.

"అజంతా బావుందా?"

తనకి తెలీదు. అన్నీ చూడందే!

"తలనొప్పి—ఒంట్లో ఎల్లాగో వుంది. అంతా చూడలేదు."

"ఈ నీళ్ళలో మొహం కడుక్కోండి."

కడుక్కుంది. చల్లగా వుంది-హాయిగా, తేరుకున్నట్లు, ప్రశాంతంగా వుంది, పూర్ణచంద్రుడు నిశ్చలంగా మెరుస్తున్నాడు. రాళ్ళ నీడలు, చంద్రుని వెలుగు నీళ్ళల్లోపడి అలలుగా సాగిపోతున్నాయి. చెట్లఆకులు ఆకలి తీరింతర్వాత ఆటకు బైలుదేరినట్లు రాలిపడుతున్నాయి, దూరంగా మనుషుల కేకలు, ఏవో అరుపులు. జలపాతం జాలిగా రోదిస్తోంది.

"వాళ్ళు నాకోసం వెదుకుతూ వుంటారు. వెడతాను. నువ్వు ఇంటికి రావూ?"

రా నన్నట్లు తల పంకించాడు. మనిషి శుభ్రంగా కనబడుతున్నా, ఆ జుట్టూ ఆ వాలకం చూస్తే ఆమెకి రోత పుడుతోంది.

"ఎప్పు డొస్తావు?"

"ఏమో!"

"ఏమో ఏమిటి?"

మాట్లాడడు.

"ఇక్క డేముంది?"

నవ్వుతాడేం!

"చెప్పు, ఏమి టా వాలకం, ఆ అవతారం?"

"ఈ ప్రపంచంపై రోతపుట్టినప్పు డల్లా దేవుడు ఓ అవతారం దాలుస్తా డంటారు పెద్దలు. ఆ యుగం అంతమొందుతుంది. మళ్ళా కొత్త యుగం, మరో అవతారం. అల్లా పది అవతారాలు జరిగాయట. నా ఉద్దేశం ఏమిటంటే ప్రతిమనిషి యీ పది అవతారాలు, తన జీవితంలో దాలుస్తూ వుంటాడని. మనిషి ఆయుర్దాయం వంద సంవత్సరా లనుకుందాం. పదేళ్ళ జీవితం ఒక యుగం.

పదేళ్ళకోసారి మరో జీవితం మొదలెడతాడు. కొందరి అవతారాలు పైటకి కనిపిస్తాయి. కొందరు లోలోన మార్పులకి గురవుతారు. తల్లి గర్భంలో శిశువుకూడా పదినెలలు పదవతారాలు దాలుస్తూ వుంటుంది."

నవ్వొస్తోంది యీ మాటలకి.

"నీ దే అవతారం యిప్పుడు?"

"వరహావతారం."

నవ్వుకున్నారు.

"ఎప్పు డొస్తావని చెప్పను?"

"మీరు నన్నిక్కడ చూపినట్లు అసలు చెప్పకండి. అ దొక్కటే నే కోరేది."

"అబద్ధం నావల్లకాదు. ఎంతో ఆతృతతో నీ కోసం ఎదురు చూస్తూ వుంది. అన్నయ్య దేశం అంతా గాలిస్తున్నాడు. ఆఫీసువాళ్ళు కూడా వాకబులు చేస్తున్నారు. ఈపాటికి పోలీసులకి ఫిర్యాదుచేసే వుంటారేమో కూడా. నీకేం వారిని గురించి పట్టలేదా?"

"ఇన్నాళ్ళూ పట్టింది."

"ఇప్పు దేమొచ్చింది?"

"స్వేచ్ఛ."

"చట్టుబండలు."

"ఇక్క డవే వున్నాయి. వాటిమధ్యనే స్వేచ్ఛ."

"ఇంటిదగ్గర స్వేచ్ఛకాక పీక్కుతిన్నారా నిన్ను!"

"సందేహం ఏమిటి—తప్పకుండా పీక్కుతిన్నారు."

"ఎవరై నా తీసుకొచ్చావా?"

తను ఈ ప్రశ్న అడగకుండా వుండా లనుకుంది. కాని అడిగేసింది. వాక్కుపై ఆమెకి అధికారం లేకుండాపోయింది. ఇప్పుడు నాలుక కొరుక్కుని ఏం ప్రయోజనం!

"ఆ"

తల పంకించి, నవ్వుతున్నాడు. అనుకున్నంతపనీ చేశాడు వృద్ధుడు. కొంప మునిగింది. ఈ వయస్సులో, ఆరేళ్ళకూతురుండగా,

శుభ్రమైన ఇల్లు. భార్య. ఉద్యోగం. సిరి. సంపద వుండగా. ఇవేం పోకిళ్ళు! ఈ మొగాళ్ళు మంచివాళ్ళు కారు. స్వేచ్ఛంటే- స్వేచ్ఛగా నలుగురితో పోవడం కావాలి వీళ్ళకి. ఏం చెయ్యడం? ఏమనాలి? చెంపమీద కొట్టా లనుంది.

"ఎవర్ని?"

"మాట్లాడడు. నవ్వుతాడేం?"

"చెప్పు?"

అయినా తన కెందుకు? ఏమిటో కుతూహలం. తెలుసుకోవాలని వుంది. మాట్లాడడు,

"ఇట్లా రండి."

దగ్గరగా రమ్మంటా డేమిటి, తప్పు కాదు?

"కాసేపు అన్నీ మరిచిపోయి, వెన్నెట్లో ఈ ప్రాచీనపు రాతిబండపై పడుకుని ప్రశాంతంగా కొన్ని క్షణాలు గడుపుదాం."

ఛీ. ఛీ, అవేమ్మాటలు.

"ఈ అందం మళ్ళా మనకి దొరకదు. పూలపరిమళం క్షణికం, బాల్యం క్షణికం, కీర్తి క్షణికం -అన్నీ క్షణికాలే-అంత మాత్రంచేత వాటిని మనం ఒదులుకోలేము. క్షణికంగనకనే. వాటిని కాంక్షిస్తాం కూడా."

ఏం సమాధానం చెప్పాలి—ఏం మాట్లాడాలి?

"నే వెడుతున్నాను."

"కాసేపు కూర్చోరూ?"

అతన్ని చూస్తే జాలిగా వుంది. పాపం! కాసేపు కూర్చోమంటాడు. అతని చూపులు ఆమె నడుంమీదకి ప్రసరిస్తున్నాయి. అట్లా చూస్తాడేం; సిగ్గేస్తుంది. శాలువా బాగా దగ్గరగా లాక్కుని. చేతులతో బిగించి పట్టుకుంది.

"ఎందుకూ?"

ఒకడుగు కిందికి దిగి రాయిమీద, కూర్చుంది. రాయి చల్లగా వుంది.

"ఇది ఎర్రరాయి. భూమిపైన వున్నరాళ్ళు సెడిమెంటరీ

రాక్స్ అంటారు. ఒకప్పుడు సముద్రగర్భంలో వుండేవి. భూగోళం పరిభ్రమిస్తూ, ముడుచుకుపోయినప్పుడు ఆ సముద్ర గర్భంలో రాళ్ళు పైకొస్తాయి. వాటికింద ఇగ్నియస్‌రాక్స్ వుంటాయి, భూమిలోపల బ్రహ్మాండమైనవేడి వొత్తిడికి భాగాలు ఛీకొని, కదిలి, పైకి ఒబి కొచ్చిన రాళ్లు, వాటికింద అసలుభూమి- అంతా ఇనుం. క్రీస్తు పూర్వం 4004 సంవత్సరం భూగోళం పుట్టిందని వెనక కొందరు నమ్మేవారు. భూగర్భపరిశోధకులు భూగోళం వయస్సు కొన్ని లక్షల సంవత్సరాలు తేడాగా నిర్ణయించగలిగారు. దీనిప్రకారం భూమి వయస్సు 350,00,00,000 సంవత్సరాలు. మీరు కూర్చున్న రాయి ముసిలిది. ముప్పైలక్షల సంవత్సరాల క్రితంది. అజంతా చిత్రకారులు, ఆనాటి సుందరాంగనలు దానిమీద నడిచారు, విహరించారు. రంగులకోసం దాన్ని పొడుంచేసేశారు, దానిలో రక్తంలేదు. ఎరుపుతగ్గి ఏడ్చి, క్షీణిస్తోంది, చూడండి ముట్టుకుంటే ఎట్లా పొడుమైపోతోందో."

రాతిని వేళ్ళతో నొక్కుతున్నాడు—పూడి, విరిగి పొడుంగా రాలుతోంది.

"దానిమీద నుండి లేచి ఇల్లా పడుకోండి."

పడుకోమంటాడేమిటి—ఎంత తెగించాడు! ఏకాంతప్రదేశం ఎరుగున్నవాళ్లు ఎవ్వరూ లేరు. అందుకనే అంత చొరవ! పైము చూసింది, ఏడు దాటింది-ఏడున్నర. వాళ్ళంతా ఏమైనారో? ఏడింటికి తిరిగి వెళ్ళాలని ప్రోగ్రాం.

"నాకీ సొదంతా ఎందుకు చెబుతావు?"

"మీరు వినరు గనుక."

ఇదివరకిల్లా గన్నాడు. నవ్వొస్తుంది,

"భూమి నోరు లేనిది, దాని సొద ఎవ్వరికీ అక్కర్లేదు. మళ్ళా మనుషులు అందులోంచి పుడతారు. అందులో కలిసిపోతారు. దాని కథ వింటే దానిపై జాలి కలిగి, దాని దురంతాలను క్షమిస్తారని చెబుతున్నాను. సీతాదేవి భూమిలో కలిసిపోయింది మీకు తెలుసుగా! దాని కెంతో అర్థం వుంది."

ఆకాశంలోకి చూస్తూ రాతి మీద పడుకున్నాడు.

"ఇది తల కింద పెట్టుకోండి."

అని తువ్వాలు, సంచీ ఆమె తల కింద రాతి మీద పెడుతున్నాడు. గుండెలు దడ దడ కొట్టుకుంటున్నాయి. ఇదేం పరిస్థితి? పాపం! అతని తల రాతి మీద చెయ్యి మీద ఆనించాడు.

"మరై తేనువ్వెవర్నో...."

"మాట్లాడకండి. చూడండి, భూమిలోంచి వింత ధ్వనులు మీ వెన్నుగుండా శరీరంలోకి తరంగాలుగా ప్రవేశిస్తాయి. వినండి - అదే విశ్వగానం అంటే—అదుగో రాతి మీద చెవి ఆనించండి. యుగయుగాల క్రితం తిరుగాడి చనిపోయిన జీవుల అంతిమ బాధ. మృత్యుఘోష, పగిలిన హృదయాల చప్పుడు—అదొక నాదం...."

కీచురాళ్ళ రొదలో తన కేమీ వినపడటంలేదు, ఇతని కేమన్నా పిచ్చెత్తదుకదా? ధోరణి, వాలకం అల్లాగే వుంది.

అల్లా నక్షత్రాల కేసి చూస్తూ పడుకుంది. అతని వైపునుండి ఏదో వింత వాసన—మొగాడి వాసన. తనకి తెలుసు. రైల్లో మొన్న అంతే. అప్పుడు - పదేళ్ళ క్రితం తిరణాలలో అట్లాంటి పరిమళం. కలకత్తాలో రోడ్డు మీద రాళ్ళు కొట్టేవాళ్ళని చూసినప్పుడు, చెల్లెలి గారింట్లో మధు సాయంత్రం ఆఫీసునుంచి వొచ్చినప్పుడు - తనకి తెలుసు. తన కిష్టం లేదు. అయిష్టత రేపేవాటిపట్ల కలిగే సానుభూతి లేకపోతే, యిల్లాంటివి భరించలేం కదా.

ఆమెకి అలకలేస్తోంది. టైము ఎనిమిదయింది. వెన్నెల స్ఫుటంగా, విశ్ఫలంగా, మెరుస్తూంది. చలి తెరలు తెరలుగా శాలువాలోంచి కవ్విస్తోంది. అతను చెప్పేది తన కేమీ అర్థం కావడంలేదు. ఇంటికి ఎగిరి వెళ్ళి చెల్లెలు కూతురు మధుర భక్తిని కౌగలించుకుని ఏడవాలనుంది ఎందుకో. ఆమెకి స్పర్శ కావాలి—మానవ శరీరంలో వేడి. దగ్గరతనం కావాలి. ఇక్కడున్నీ రాళ్ళు—ఇక్కడింకా వుంటే తనూ ఒక రాయిగా అవగలదు. ఆమెకి భయమేసి లేచింది.

"అమ్మో చాలా పొద్దు పోయింది."

అతను లేచి సంచీ సర్ది నడుస్తున్నాడు. మాట్లాడకుండా

నడుస్తున్నారు—ఆలయంలో రాతి స్తంభాలలాగా, దగ్గరగా వుండి కూడా కలుసుకోలేరు. అతను ముందు, ఆమె వెనుక; వేగంగా నడుస్తూ తను ముందు కెళ్ళింది. అతను వెనుక పడ్డాడు, ఇద్దరూ వొకరి పక్కన వొక రుండడం లేదు. ఇంక ఆలోచన లేదు. అలసిన శరీరం ఆలోచించదు. టీకొట్ల దగ్గరకి చేరుకున్నారు, జనం లేరు. పాకలో ఓ చిన్న దీపం గాలిలో గిలగిల తన్నుకులాడుతోంది. దాన్ని కీటకాలు వోదారుస్తున్నాయి. అజంతా గుహల్లో చీకట్లో వెన్నెల మధ్య భీకరంగా మెట్ల ముందు స్తంభించి వున్నాయి. గుహలలో ఎంతో సౌందర్యం - గతించిన గాధలు, విన్యాసాలు, సొగసులు, రంగుల కలయిక, ఆ యుగంలో సజీవాలైన శృంగారం, భక్తి, దీక్ష, తృష్ణ, వేట, జననమరణాలు శాశ్వతంగా చీకట్లో చైతన్యం పొందాయి. ఆమె హృదయంలో మాత్రం ఆ చిత్రాలు పరివర్తన తీసుకురాలేదు. దేశ దేశాలనుంచి వొచ్చి చూసి పొయ్యే యాత్రికులు, కళాకారులు, చరిత్రకారులు, సంస్కర్తలు, వాటి సౌందర్యం స్తుతించి పోతారు, తన కా అనుభూతి కలగలేదు. ఎందుకో?

అకలేస్తూంది. అందుకు నవ్వుకుంది. నడుస్తున్నారు.

"వాళ్ళెవరూ కనబడరేం?"

అతనేమీ మాట్లాడలేదు. అతనికి కోపం వొచ్చిందా? పాపం వొంటిగా, దిగులుగా వున్నాడు. కాస్తంత బుజ్జగిస్తే - తనలో ఔదార్యం, కారుణ్యం - ఏవేవో వున్నాయి. వాటిని వుపయోగించే అవకాశాలు లేక, ఇంద్రియాలు ఎండి, ఎత్తునుండి పారుతూ వొంపు దగ్గర దాకా ప్రవహించి నిలిచిపోయిన పెద్ద జల ప్రవాహంలా తనలో అల్లా వుండిపోయాయి. అతని పక్కగా నడుస్తూంది. అతనింకా వేగంగా నడుస్తున్నాడు.

"ఏం మాట్లాడాలి?"

"మరిప్పుడు నే వెళ్ళడం ఎల్లా?"

"ఇప్పుడు వెళ్ళలేరు. రాత్రికి భోజనం చేసి పరుండండి. రేపుదయం స్టేషన్‌లో దింపుతా జీపులో. ఔరంగాబాదులో నా

స్నేహితు డొకడున్నాడు. అతను ఓ నెల రోజులు సెలవు పెట్టి వాళ్ళ వూరు వెడుతూ, కావాలంటే తన జీప్ ఆ నెల రోజులు వాడు కోమని వ్రాస్తేనే. నే ఇల్లా వొచ్చింది'' అన్నాడు.

బసలోకి చేరుకున్నారు. ప్రొద్దున్న వా రొచ్చిన బస్సులో కండక్టర్ ఎవరో, అక్కడ నిలబడి వున్నాడు. తన కోసం వారంతా ఓ గంట వెదికారట. అరగంట క్రితమే వెళ్ళారుట. అతన్ని అక్కడ వుండి, తన వయనం తెలుసుకుని స్టేషన్‌కి తీసుకు రమ్మ న్నారుట. ఔరంగాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసి మరికొంత సిబ్బందితో మళ్ళా పుదయాన వొచ్చి వాకబు చేస్తారుట. ఎంత గొడవ జరిగింది? తను వొచ్చెయ్యకూడదూ—ఎందుకల్లా ఆ రాళ్ళ మీద పడుకుని వుండటం? ఇప్పుడు చేసే దేముంది? ఆవరణలో పెద్ద భవనం, ఎదురుగా మూల వో చిన్న గదుంది. దాని ముందు వరండా, ఎత్తుగా, లావుగా, నల్లగా ఎవడో వో వ్యక్తి వొచ్చి: దుప్పటి పరిచాడు, భోజనం ఏర్పాటు చేశాడు

ఆకలిగా వుంది. భోజనాలు చేశారు. ప్రాణం కుదుట పడింది. వెన్నెల అందంగా కాళ్ళ ముందు పడుతోంది. ఆ నల్లటి, ఎత్తు వ్యక్తి వంటవాడులా గున్నాడు, 'షూజా' అని పిలుస్తున్నాడు. పొట్టి నిక్కరు—నెత్తిన టోపీ-వొంటి మీద చొక్కా లేదు. వెన్నెల్లో అతని కండలు, వొంటిలో నునుపు వొంకరలు, నీడలు తీర్చుకుని కదులుతున్నాయి. కండక్టర్ కూడా భోజనం చేశాడు. పదకొండింటికి ఒక లారీ అటు వెడుతుందిట అందులో వెడతాడుట. తనని కూడా ఇష్టమైతే రమ్మన్నాడు, తనకి వెళ్ళాలని వుంది, అర్ధ రాత్రి, భయమేస్తుంది. మధు కూడా వస్తాడా?

''వొస్తావా, నువ్వు కూడా?''

రానన్నట్లు తల వంకించాడు.

''మరి నే వెళ్ళేదా?''

''ధైర్యం వుండి, వెళ్ళాలని వుంటే వెళ్ళొచ్చు.''

అతనికి కోపం వొచ్చిందని నిర్ణయించుకుంది. తనేమన్నా నని అంత కోపం? ఆమె ఎవరో చూడాలన్న కుతూహలం పీడి

స్తూంది. రాత్రి వుండి. ఏం జరుగుతుందో. యీ కథేమిటో క
క్కోవాలి. చెల్లెలు అడిగితే ఏం చెప్పడం? అంతు చూడాలి. త
బంధువొకడు తటస్థపడ్డాడనీ, అతనితో కలిసి తిన్నగా ఇంటికి వెళ
తున్నాననీ, జరిగినదానికి క్షమించవల్సిందనీ కోరుతూ షీలా లా
రన్‌కి ఓ ఉత్తరం వ్రాసి, కండక్టర్ చేతికిచ్చి, వాడి చేతిలో
రూపాయి పెట్టింది. వాడు సెలవు తీసుకుని వెళ్ళాడు.

షూజా భోజనం చేస్తున్నాడు. ఆమెకి అలసటగా వుంది.
నిద్ర వొస్తూంది. పక్కచుట్ట కోసం చూసింది. ఏదీ కనబడదేం?
అరరె—వాళ్ళు తీసుకుపొయ్యారా? లేక మధుసూధనం తాలూకు
మనిషి తస్కరించిందా? వెదుకుతోంది. కనబడదు. ఎట్లా పడుకోడం?
మధుసూధనం గదిలో పక్క అమర్చాడు. తనపక్క—ఎట్లాగబ్బ!
పరాయి మొగాడి పక్క మీద పడుకోడం? గత్యంతరంలేదు.

"ఆమె కనబడదేం?"

అడిగేసింది తెగించి. అతను బిగ్గరగా నవ్వుతున్నాడు.

"ఆమె ఎల్లోరాలో వుంది."

"అదేమిటి?"

"అవును. రేపు నాతో వొస్తే అక్కడ చూపిస్తా. ప్రస్తుతం
ఆమె భర్తను చూడొచ్చు మీరు. అడుగో వాడే షూజా" అన్నాడు.

భర్తతో కలిసి ఆమెను లేవదీసుకు రావడ మేమిటి. ఎక్కడా
వినలేదే తను! భర్త వొప్పుకుంటాడా! ఏమో. డబ్బు ఆశపడి.
మొగాళ్ళు ఏది పడితే అదే చేస్తారు కాబోలు. తనకేం తెలుసు.

"ఎల్లోరాలో ఒంటిగా ఎందుకుంది?"

"రేపు చూస్తే మీకే తెలుస్తుంది."

ఆవులింత ఆపుకుంది.

"మీ రల్లా గదిలో పరుండండి."

"నువ్వో?"

"నే నిక్కడ—ఈ వరండాలో. షూజా జీప్‌లో."

"నా కొక్కదానికి లోపల భయమేస్తుంది."

అల్లా అన్నందుకు నాలిక కొరుక్కుంది జ్ఞానసుందరి.

''నేనిక్కడే వున్నాగా. పైగా మీకు వెంటనే నిద్రపట్టే స్తుంది. అలసివున్నారేమో.''

లోపలికెళ్ళి పడుకుంది.

''చలిగా వుంటుంది. తలుపులు దగ్గరగా వేసుకోండి'' అన్నాడు.

తలుపు దగ్గరగా వేసి పరుంది. ప్రాణం హాయిగా వుంది. నిద్ర వొచ్చేస్తోంది. తనకి మధుసూదనం అర్థంకావడంలేదు. ఇదంతా గందరగోళంగా వుంది. తనిల్లా రాత్రి వుండిపోవడం పొరబాటు. వెనక అతను చేసిన చేష్టలు, చూపిన వికారాలు అనుభవం అయి వుండికూడా, తను కుతూహలానికి లోంగిపోయి యీ పరిస్థితిలో చిక్కుకుని వుండకూడదు. మధురభక్తి జ్ఞాపకాని కొచ్చింది. చాలా అందమైన పిల్ల—బొద్దుగా వుంటుంది, వాళ్ళ నాన్నకి మల్లె. కలక ల్లాడే మొహం. దాన్ని తన దగ్గరే వుంచుకుని చదువు, నాట్యం చెప్పించి, మంచి కుఱ్ఱవాడిని చూపి పెండ్లిచేసి, పెద్ద తనంలో తను వాళ్ళ దగ్గరే వుండిపోవాలి. జ్ఞాపకం వొచ్చింది. వెనుకోమారు తను మధుర భక్తి చలాకీని. తెలివిని మెచ్చుకోటం విని మధుసూధనం వో మాటన్నాడు.

''దానికి అచ్చంగా మీ పోలికే.''

అర్థంలేనిమాట. తన పోలిక దానికెల్లా వొస్తుంది? ఏమో. పింతల్లి, పెత్తల్లుల పోలికలు రావడం అసహజం కాదు అ మాట పీకుతోంది. ఏదేమైనా మధురం అంటే అతనికి ఎంతో ప్రేమ.

'ప్రేమ'—అంటే తనకేం తెలుసు?

భర్త. ప్రియుడు. పిల్లలు లేరు తనకి. పుస్తకాల్లో, సినిమాల్లో, నాటకాల్లో. ఇతరుల సంసారాల్లో చూసి ఆనందించడమే తనకి పరి పాటైపోయింది. ఎవరో తలుపు తెరిచినట్లనిపించింది. దీపం ఆరి పోయింది. ఎవరిదో చెయ్యి—ఆ వేళ్ళు. ములక్కాడల్లాంటి అతని వేళ్ళు తన జుట్టుని నిమురుతున్నాయి. తన నడుంచుట్టూ జ్వాలలా పెనవేసుకుంటున్నాయి. మెత్తగా, పదునుగా, వెచ్చగా తన శరీరాన్ని వేళ్ళమధ్య ఇముడ్చుకుని. బంతిలా చేసేసి, నలిపేస్తున్నట్లు....కాలు

వాలో గుండెలమీద తన చేతులే—ఏమీలేదు. లేచి కూర్చుంది.గాలికి తలుపులు తెరుచుకున్నాయి- లేచి బయటకొచ్చి చూసింది. మధుసూధనం ముసుగు తన్ని నిద్రపోతున్నాడు. మాట్లాడాడు. వులిక్కిపడింది.

"లోపల నిద్రపట్టడంలేదా?"

"లేదు—లేదు—ఏదో చప్పుడైనట్లుంది. దాహంగా వుంటే లేచాను."

అతను లేచి మంచినీళ్ళగ్లాసు తెచ్చాడు, చల్లగా వున్నాయి—పళ్లు సలసలమన్నాయి,

"ఇక్కడ వొక్కళ్ళకే భయంగా వుంటుంది."

"మరొకళ్ళు వున్నప్పుడే భయంగా వుండేది. ఒక్కడికి ఏ భయమూ వుండదు, భాగ్యవంతుల మధ్యలో వున్నప్పుడే బీదవాడి. బీదతనం తెలుసొస్తుంది. మరొకరి సమక్షంలోనే, పోలికలు, కొలతలు, హెచ్చు తగ్గుల విలువలు కట్టడాలు."

ఆవలిస్తున్నాడు. వెన్నెల ఉంగరాల జుట్టులో ఇరుక్కుని గాలికి తన్నుకులాడుతోంది. లోపలి కెళ్ళి పడుకుంది.

అతను పక్క గుమ్మం దగ్గరగా లాక్కుని పరున్నాడు. తలుపు సందులోంచి చూస్తోంది. మళ్ళా లేచాడు,అటూ ఇటూ వెన్నెట్లో పచార్లు చేస్తున్నాడు. ఆకాశంలోకి చూస్తున్నాడు. కూర్చున్నాడు—తనగదికేసి చూస్తున్నాడు. చూపులు తన నడుంమీద, వక్షంపైనా ప్రసరిస్తున్నాయి. కళ్ళు పెద్దవిచేసి చూసింద. తనకేసి చూడ్డంలేదు. అతని వెనకభాగం తనవైపుకుంది. నక్షత్రాలకేసి చూస్తున్నాడు. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఏదో జరగబోతోంది—తాను సిద్ధంగా వుందా? నరాలు, రక్తం వొక్కసారి చెలరేగినట్లు, శరీరం తృష్ణతో బిగిసి. విడి, విడి బిగిపి, సర్దుకుని, సిద్ధమై, స్థిమితపడి, ఉదయించని సూర్యునివైపు చేతులు జోడించిన ఋషి ప్రశాంతత తనలో కమ్ముకుంది, చలిస్తున్న స్థనాలని చేతులతో నొక్కిపెడుతోంది.యోగి జోడించిన చేతివేళ్ళల్లా పైకి నిలబడి, లోతుకేసి చూడని శిఖర ద్వయంలా, తన రొమ్ములమధ్య అజంతా గుహల చీకటికి చోటు

దొరక్క. మొనలచుట్టూ, చంద్రబింబం చుట్టూ అలుముకున్న కాంతి
పుంజంలా, నలుపు కరిగి. గుండ్రంగా కమ్ముకుంది. చర్మంలో కోటి
అణువులు పిల్లలై, జీవుడు ఆడక, సృష్టిని వెదుకుతూ తొంగిచూ
స్తున్నాయి. అమ్మో—శరీరానికి ఎంత శక్తి, ఎంత వొత్తిడి, ఎంత
బలం—యుగయుగాలుగా భూగర్భంలో అణగారిన శక్తులు వొక్క
సారిగా భూకంపంద్వారా ప్రేలి బైటపడ్డంత శక్తి. సముద్రగర్భాన్ని
కలిచివేసి నెట్టి బైట వొడ్డున ముద్దకింద ఎండించి పడేసినంత
వొత్తిడి, మహత్తర శిఖరాలని కూల్చి అధోలోకంలోకి లాక్కుపోయి
నంతటి బలం. అన్నీ ఆమె శరీరాన్ని మద్దించి వేస్తుంటే, శాలువాలో
శరీరం నగ్నశక్తిని దాచివెయ్యాలి, అందుకే దుస్తులు. శరీరానికి
సంకెళ్ళు—ఈ కొత్తరకం బ్రేషియర్లు—చారుమతి బొంబాయిలో
కొంది—ఛఛ. ఏమి టీ ఆలోచనలు—కనురెప్పలమీద బరువు,
కళ్ళల్లో మైకం, శరీరం తృష్ణతో పొంగి. విముఖతలో కుంగి మన
స్సుని కనురెప్పల వెనక, అలిపిన అణువుల వెనక నొక్కిపడేసి,
దుస్తులు తీసేసి, తన చీకటి శరీరంలోకి లాక్కుపోతోంది నిద్రాదేవత.
ఆమె శ్వాస, ఆమె చీకటి మందహాసం. ఆమె ఏకాంత నగ్న సౌంద
ర్యం....ఎక్కడికో, ఎందుకో, ఎప్పుడో....అజంతా గుహలో సమా
ధైన రహస్యానుభవం....మరి....అంతే....

* * *

లేచేటప్పటికి ఏడైంది. మధు లేడు. తను మొహం కడుక్కుని
స్నానం చేసేటప్పటికి షూజా టీ తయారుచేసి వొకప్పు తెచ్చాడు.

మధుసూధనం ఏక్కడికెళ్ళాడో? అల్లా నడుచుకుంటూ
వెళ్ళింది కాలిబాటమ్మట. అన్నీ రాళ్ళు. ఎర్రవి. పచ్చవి, రంగురంగు
లవి. చెట్టుకింద కూర్చుంది. ఎండ తీక్షణంగా వున్నా గాలిలో చలి
తెరలు కప్పేస్తూనే వున్నాయి. ఔరంగాబాద్ వెళ్ళగానే నాగులుకి టెలి
గ్రాం యివ్వాలి. ఇంటికి వెళ్ళి ఏమిటి చెప్పడం? రాత్రి అల్లా ఏకాం
తంగా గడిపినా, ఏమీ జరగలేదంటే చెల్లెలు నమ్ముతుందా? ఆమె
మనస్సు నిర్మలమైంది. లోపల ఏ ఆలోచనలున్నా ప్రవర్తనలో లోపం
లేదు. తొమ్మిది దాటుతోంది, మళ్ళా బంగళావైపు వెళ్ళింది. వరండాలో

మనుషుల అలజడి లేదు. గది తలుపులు వేసి వున్నాయి, కిటికీ సందు
ల్లోంచి లోపల చూసింది, మధు లోపల వున్నాడు. షూజా మూలగా
నిలబడి వున్నాడు. మొలచుట్టూ చిన్నగుడ్డ మినహా వొంటిమీద
దుస్తులు లేవు. తాడు అతని చుట్టూ వేసి, ఏవో కొలతలు తీసుకుంటు
న్నాడు మధుసూధనం. రెండడుగులు వెనక్కివేసి చతికిల బడ్డాడు.
ఏదో దబ్ దబ్ మని చప్పుడవుతోంది.

"ఎవరది?"

"ఎవ్వరూ లేరు,"

బైటకొచ్చాడు మధు,

"మీరా!"

"అవును. ఇంకెవరుంటారు?"

"స్నానం అయిందా?"

"ఆహా, ఏమిటి లోపల?"

"మరో అవతారం."

నవ్వుతూ లోపలికెళ్ళి తలుపులు మూశాడు, ఆమెకి కోపం
వొచ్చింది. పక్క చుట్ట వరండాలోకి లాక్కుని పరుంది.

పన్నెండింటికి భోజనా లేర్పాటుచేశాడు షూజా. భోజనం చేశాక,
అజంతా గుహలకి బైలుదేరారు. ఆమె వెనక అతను ముందు—ఆమె
ముందు-అతను వెనక.

జనం వెడుతూ వొస్తూ వున్నారు ఒకాయన గుహముందు
మంటపంపై నున్న చిత్రానికి రంగులతో నకలు తయారు చేస్తున్నాడు-
ఎవరో దొరలా వున్నాడు. బుడ్లల్లో చుట్టూ రంగులు పెట్టుకున్నాడు.
మధుసూదనం చాలాసేపు అక్కడ నిలబడి చూస్తున్నాడు, వాళ్ళేదో
మాట్లాడుకుంటున్నారు. పదో గుహ అతి ప్రాచీనమైంది—క్రీస్తు
పూర్వంరెండువందల ఏళ్ళనాటిదిట. స్తంభానికి ఆనుకుని ఆమె నిల
బడింది. అతను కాస్త దూరంగా వెళ్ళి ఆమె శరీరాన్ని పరీక్షగా
చూస్తున్నాడు. సిగ్గేస్తుంది, అట్లా చూస్తాడేం—

"ఏమిటది-అట్లాగెందుకు చూస్తావు?"

"మీ వెనక గోడమీదవున్న ఆ మూర్తిది అచ్చంగా మీలాంటి శరీరమే. మీ పేరేమిటి?"

"నా పేరా-నీకు తెలీదు?"

"తెలుసు. జ్ఞానసుందరిగారు. మీరు అజంతా సుందరులు."

"ఏం మాటలవి!"

"ఎన్నాళ్ళనుండో పీడించిన సమస్య ఈనాడు తేలిపోయింది."

"ఏమిటది?"

"ఇప్పుడు చెప్పను. చెప్పకూడదు."

కుతూహలం ఎక్కువవుతోంది. విషయం ఏదో వుంది. తనలో ఆందోళన పెరుగుతోంది.

"నే వెళ్ళిపోతా చెప్పకపోతే—"

"మీ రెక్కడికీ వెళ్ళలేరు."

ఒకతల. మళ్ళా బొమ్మలు చూస్తున్నారు. నాలుగు శరీరాలు గల లేడి చిత్రం. నల్ల రాకొమార్తె—వొంకర కాలు స్త్రీమూర్తి. ఏనుగులవేట—ఆబోతుల పోట్లాట—అలంకరణ—రాగోదయం—ఏవేవో. తను బైటకొచ్చేసింది. టీ దుకాణం దగ్గర టీ తాగింది. షూజా అక్కడే వున్నాడు—నల్లగా. ఎత్తుగా. కండలు తిరిగిన శరీరం వాడూను. నవ్వుతాడు. పళ్లు తెల్లగా మెరుస్తున్నాయి. టోపీ—వాడి వాలకం. అజంతా గుహలో వో చిత్రంలా వున్నాడు.

రెండు కావొస్తోంది. బంగళా కెళ్ళి, సామాను జీప్‌లో జేరేసి ప్రయాణం అయ్యారు. షూజా ఒక పొడుగాటి బుట్టలో ఏదో పెట్టాడు. దానిచుట్టూ గుడ్డ చుట్టి వొళ్ళో పెట్టుకున్నాడు. ఔరంగాబాదు చేరేప్పటికి నాలుగు దాటింది. పోస్టాఫీస్ కెళ్ళి టెలిగ్రాం యిద్దామంది. వద్దన్నాడు. టిఫిన్ తీసుకుని బజారుకెళ్ళి తనో చీర కొనుక్కుంది,

హోటల్లో షీలా లాజరస్‌కి మరో చీటి వ్రాసి పెట్టింది. అన్నయ్య—కలకత్తా అడ్రెస్‌కి వో వుత్తరం వ్రాసింది. ఎల్లోరాకి బైలుదేరారు. రోడ్డుమీద దుమ్ము సంధ్యలో ఎర్రగా మందంగా రేగుతోంది. దుమ్ముకి రంగుపోగొట్టుకున్న చెట్లఆకులు, మ్రానులు మందానపడ్డట్లు చలనంలేక వ్రేళ్ళాడుతున్నాయి.

ఎల్లోరా గుహలకి చేరుకున్నారు. మళ్ళా మనుషుల అలజ
గుహల్లోంచి బైటకొస్తున్నారు. అక్కడో టీ దుకాణం. షా
సామాను. వో పెద్ద బంగళా ఆవరణలో దిగారు. వాడు ఆ సామా
తీసుకెళ్ళి మూలనున్న ఓ పాకలో పడేశాడు.

"నువ్విక్కడే వుండు—ఓ అరగంటలో వొస్తాం" అన్నా
మధుసూదనం జీపు నడుపుతున్నాడు. తను వెనక సీట్‌లో కూర్చు
నుంది. అతని ఎదురుగా అద్దం ముక్కలో తన మొహం కనబడు
తోంది. అతని జుట్టు కనబడుతోంది. అతని జుట్టు కనబడుతోంది.
తన మొహం దుమ్ముతో ఎర్రబడింది. చీదరగా వుంది—ఏదైనా
జలపాతం వుంటే దానికింద నిలబడి స్నానం చెయ్యాలని వుంది.
మలుపు తిరిగి, కొండమీదికి వెడుతోంది జీప్, సంధ్యలో కొండ పైన
మీద రాళ్లు ఎర్రగా ప్రజ్వరిల్లుతున్నాయి. ఒక్కొక్క దృశ్యాన్నే
దుస్తులు తీసి లైటు ఫోకస్‌చేసినట్లు వొంపుల నీడల్ని కడసారి
కిరణాలు వెలిగించి వీడ్కో లిస్తున్నాయి,

జీప్ నిలిచింది. అతను దిగాడు.

"దిగండి - తొందరగా రండి."

ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఎందుకు
ఎవరు? ఏముం దక్కడ? కొండ పై భాగం—కా స్త మేర చదునుగా
వుంది. దూరంగా ఓచెట్టు ఆకులు లేకుండా, నగ్నంగా ఒంగి వుంది.
పెద్ద గాలికి వూడి లోయలో పడిపోతుంది. లోయలోకి చూస్తోంది.
దాని వేళ్ళ పరంపర చివ్వర ఒక్క ఆకు కొనవూపిరితో అల్లల్లాడు
తోంది—సముద్రంలో మునిగిపోతున్న పడవ తెరచాప కొసలాగ.
జీప్‌లో గోనిపట్టా చెట్టుముందు రాతిమీద పరిచాడు. ఏమిటిదంతా?
ఏం చేస్తాడో?

"అల్లా పడుకుని పడమటి ఆకాశంకేసి చూడండి."

అతను పక్కన మరో బండమీద కూర్చుని ఆకాశంలోకి
చూ స్తున్నాడు.

"అది సూర్యాస్తమయం. అపూర్వ దృశ్యం. అది చూడ
టానికే ఆస్ట్రేలియానుండి మనం అజంతాలో చూపిన దొరగారు

కస్త. ఆయన గొప్ప చిత్రకారుడు. ఇక్కడి సూర్యాస్తమయం చూడ్డానికి తాను అంతదూరాన్నుండి చేసిన ప్రయాణం వృధా కాదన్నాడు.''

సూర్యబింబం ఆకాశం అంచున దిగుతోంది. కిందంతా లోయ—అంతా మసగలో గుండ్రని బైలుగా కనబడుతోంది. అక్కడక్కడ శిథిలభవనాలు, బురుజులు, పమిట కొంగు అంచులా కోటగోడలు, అక్కడేదో తిందామని పోతున్న పక్షుల గుంపులు. ఆకాశంలో చెమట బిందువులలాగ, ఎర్రవి, పూదావి, బంగారంవి, రంగు రంగుల మేఘాలు పుష్పాలతో ఆలయాని కెడుతున్న కన్యలకి మల్లే, సూర్యుడి చుట్టూ ప్రదక్షణాలు చేస్తున్నాయి.

చెట్లు, కొండలు చోద్యం చూడ్డానికి అటు వొంగినట్లున్నాయి. దిగిపోతున్నాడు వేగంగా—కిరణాలు పొడుగువి, పొట్టివి, హాస్యం కోసం కన్యలకి చక్కలిగింతలు పెట్టినట్లు, మేఘాలలో దూరి, దాగిలిమూత లాడుతున్నాయి. సిగ్గుతో, నవ్వి, బిడియంతో మేఘాలు పైపైకి పరుగులెడుతున్నాయి. అలిసిన కన్యల నుదుటిమీద చెమట బొట్లకిమల్లె పక్షుల గుంపులు. అక్కడక్కడ రిబ్బన్ పూడిన పిల్ల జడకిమల్లె గాలిపటాలు దారం సడిలి పడిపోతున్నాయి.

తనకేసి చూస్తున్నాడు—అతను. గమనించనట్లు సూర్యుడి కేసి చూస్తున్నదామె. మెడకింద జాకెట్టు మధ్యలోకి చూస్తున్నాడు. సూర్యకిరణాలు స్తనాలమధ్య సందులోపడి గుండ్రటి నీడద్వయంగా విడిపోవటం చూస్తున్నాడా? అటు యిటు కదిలింది. పమిట బొత్తిగా జారిపోయింది. నేలమీద వక్షాన్ని ఆనించి పరుంది. ఇప్పుడు ఫరవాలేదు.

''అది వీనస్ గ్రహం. దాని ప్రతిభ. ప్రభ ఒక్క గంట మాత్రమే. తర్వాత అంతర్థానమౌతుంది ఆగ్రహం సూర్యుడి సంతానం. తండ్రిచుట్టూ తిరుగుతూంటుంది. అల్లా తిరుగుతుంటే చూస్తూకూర్చో వాల్సిందే కాని. 'అమ్మో నాబిడ్డ' అని దగ్గరకి తీసుకుని కౌగిలించుకో లేడు సూర్యుడు పాపం! అంతే సృష్టి శాసించింది. మనుషులజీవితాలూ అంతే. ఒకర్ని ఒకరు చూస్తూ కూర్చోవాలి. వారి సుఖదుఃఖాలు

ఖ్యాతి అపఖ్యాతులు, జనన మరణాలు—దగ్గరగా తీసుకొని అవి తమవిగా తమలో లీనం చేసుకుని ఏడవడానికీ, నవ్వడానికి లేదు. గతులు తప్పనివి మానవహృదయాలు. అదే కొట్టుకోడం, తన్నుకోడం, అదే లయ, క్రమం—ఆ చర్మం, ఆ రక్తం, ఆ ప్రేవులు, ఆ నరాలు—వాటిల్లో అల్లా యిరుక్కుపోయి తన్నుకులాడాల్సిందే—ఏ రెండు గుండెలూ గతులు తప్పి, దగ్గరకొచ్చి, లీనమై ఒకటి కావు. అతన్ని చూస్తే జాలిగా వుంది. అతని కేం కావాలి? అతనిపై తనకి జాలిలేదు, నిజంగా తన పైననే తనకి జాలి. చెల్లెలు అందమైంది. ఇద్దరూ అన్యోన్యంగా వుంటారు, అతని కావల్సింది ఏదో ఆమెలో లోపించి వుండాలి. అ దేమిటో తనకి తెలీదు, ప్రక్కన గడ్డికాడలను తెంపుతూంది. అతని చెయ్యి అక్కడ వుంది—వేళ్ళ మధ్య గడ్డికాడ లున్నాయి. అక్కడికి తన చేతిని పోనిచ్చి, గడ్డిని కోస్తోంది. అతను చేతిని ప్రక్కకి లాగేశాడు.

సూర్యుడు దిగిపొయ్యాడు. ప్రకృతి సేరుకుంటున్నట్లుగా నిశ్శబ్దంగా వుంది. లేచాడు. తనూ లేవడానికి యత్నిస్తూ చేతిని పైకి ప్రదర్శించింది చేయూత నిమ్మనట్లుగా-మోచేతిని పట్టి, లేవదీశాడు—గట్టిగా, వెడల్పు తీగలాగా పెనవేసుకున్న అతని వేళ్ళంటే తనకిభయం. జీప్‌లో ఎక్కాడు, తను అతని ప్రక్కనే కూర్చుంది. ఒద్దనలేదు. ఐదు నిమిషాల్లో కిందికి మలుపులో బంగళాకి చేరుకున్నారు.

బంగళావున్న ఆవరణలో వో మూలగా పాకలాంటి దుంది. అందులో కెళ్ళారు. షూజా కుండలతో నీళ్ల తెచ్చాడు. చలేస్తోంది. ఎల్లాగ స్నానం చెయ్యడం? ఒళ్ళంతా దుమ్ము, చీదరగా వుంది. షూజా టీ పెట్టాడు. స్నానంలాంటిది చేసి, కొత్తచీర కట్టుకుని టీ త్రాగి పక్కచుట్టని ఆనుకుని వరండాలో స్తంభం పక్కన కూర్చుని ఆకాశంకేసి చూస్తోంది. మధు స్నానంచేస్తూ సంగీతం మొదలెట్టాడు. పావుగంటలో వొచ్చాడు. సన్న దీపం నీడలో అతని మొహం చూపింది. ఆ గడ్డం ఎందుకు? క్షౌరం చేసుకోరాదు!

"బంగళాలో వుండకూడదూ?" అంది తాను.

"అందులో చోటులేదు. పెద్ద పెద్ద ఉద్యోగులకే దొరుకుతుంది. ఈ పాక నేనే వేయించాను."

"ఎప్పుడు?"

"అప్పుడే ఇక్కడికొచ్చి ఇరవై రోజులు దాటుతోంది. రెండువారాలు ఇక్కడ గడిపి అజంతా వెళ్ళాను. మీ రొచ్చారు."

"ఇక్కడేం బాగుంది?"

"ఎవరిపిచ్చి వారి కానందం."

"కాలక్షేపం అవుతుందా?"

"అవదు."

"మరి?"

"కాలక్షేపం కాకూడదనేగా యిక్కడికి వస్త. ఎల్లోరా శిల్పాలలో సోమరితనం చూస్తాం. ఏదీ వున్నచోటనుండి కదలదు: ఎదగదు; ముసిలితనం తెచ్చుకోవు. అల్లానే వుండిపోతాయి."

"బాగుంది—అవి రాతి బొమ్మలు."

"వాటికి గుండె లున్నాయి-కాని చలించవు, కొట్టుకోవు—పగలవు కూడా. కాసేపు అల్లా వెళ్ళొస్తా...." అని లేచివెళ్ళాడు. తనని రమ్మనలేదేం? కళ్ళు మూసుకుని పడుకుంది.

తొమ్మిది దాటింది. ఘూజా చపాతీలు తయారు చేశాడు.

"ఇక్కడ మజ్జిగ దొరకదు."

అన్నాడు మధుసూదనం.

రెండు గుంజలకి తాడు వేళ్ళాడదీసి దానిమీద దుప్పటీ పరదాలా వేశారు, దాని ప్రక్కన ఆమెపక్క. వరండాలో స్తంభం వెనక అతనిపక్క. అతని పాదాలమీద వెన్నెల పడుతోంది. గాలికి పంచె పైకి కదిలింది. అతని కాళ్ళకి వెంట్రుకలు లేవు — ఆడదాని కాళ్ళలా—అల్లా వుంటే ఏం బాగుంటాయి! స్నానంచేసి రాగానే అతని ఛాతీ చూసింది — బొడ్డుకింద సాఫీగా చట్టాలాగున్న పొ త్తి కడుపు కనిపిస్తోంది. ఆ గడ్డంలో మధ్యమధ్య తెల్ల వెంట్రుకలు. అప్పుడేనా—తనకంటే ఆరు నెలలలో ఏడాదో చిన్నవాడంటుంది చెల్లెలు. అతనే అంత పెద్దవాడైతే, తనెంత పెద్దదిగా కని

పేస్తుందో, ఎవరిది వారికి తెలీదు. బైటవాళ్లు యీ విషయాల్లో పొరపాటు చెయ్యరు. వయస్సు, తిథి, వారం, గంటలు నిమిషాలతో సహా నిర్ణయించి వేస్తారు. 'అమ్మాయి'. 'అమ్మాయిగారు' 'అమ్మ' 'అమ్మగారు' 'అత్తయ్యగారు' 'పెద్దమ్మగారు'....తన అవతారం సంబోధనలో నిర్ణయమై పోతుంది....తనని అత్తయ్యగారు అనడం దగ్గర కొచ్చింది. జడ ముడిగా చుట్టి, కొంగు జుట్టుమీద కప్పుకుని, చేతులు తొడల మధ్య బిగించి పడుకుంది.

"మరి ఆమె ఎక్కడ?"

అని అడిగింది తాను ఆవలింతని ఆపుకుని.

"రేపు చూపెడతా?"

"ఎక్కడుంది?"

"చూస్తారుగా."

ఆమెను వూహించుకోటం చేతకావటంలేదు-నలుపా. ఎరుపా. పొడగరా? ఏ కులం?. ఎంత వయస్సు? ఎవరి తాలూకు? ఎన్నో తెలిస్తేగాని వూహించలేం. మధుసూదనం గురించి తనకి కొంత తెలుసు, దాన్నిబట్టి వూహించగలదా? ఎత్తుగా, సన్నంగా వుండాలి. నడుందగ్గర స్ఫుటమైన వొంపు వుండాలి. పొట్టిమెడ కింద రొమ్ముల పైన మెరుపుండాలి-అవి....పెద్దవిగా, బరువుగా పిగ్గేస్తుంది-ఏమిటీ ఆలోచనలు. చేతులని గుండెలపై కట్టేసుకుని, చీర పాదాల కిందికి లాగి, ఏదో రహస్యాన్ని ఆ శాలువాలో దాచినట్లు లుంగ చుట్టుకుని పడుంది. నిద్రపట్టేసింది. ఎవరో లేపితే, తను లేవదు. అది నిశ్చయం.

తెల్లారి ఐదింటికే మెళకువ వొచ్చింది, మధుసూదనం లేడు-ఎటో వెళ్ళాడు. కుర్రాడు మాజా మంచివాడు. క్షణంలో టీ తయారు చేస్తాడు. ఎప్పుడు కావాలో అడక్కుండా తెలుసుకుంటాడు. మరి స్నానం? మళ్ళా యీ చన్నీళ్ళే. అందులో కుండలోవి. తప్పదు. ఎల్లాగో వుగ్గపెట్టుకుని స్నానం చేసింది, మనసు. వొళ్లు నిర్మలంగా, నిశ్చింతగా వున్నట్లుంది. అద్దంలో చూసుకుంది. కొండ వెనక సూర్యుడు లేస్తున్నాడు - అప్పుడే నిద్రనుండి లేచిన మత్తుతో మిళిత

మైన ఎరుపుని ఆకాశంలో కడుగుతూ, చెట్ల ఆకుల్లోంచి కిరణాలు తన జుట్టుని, మొహాన్ని వెలిగించాయి. అద్దంలో మెరిసిపోతోంది. నిర్మలమైన మొహం—పల్చటి చెక్కిళ్ళు. ఉదయకిరణం పొడిచి, పొడిగి గుడ్డులోంచి బైటదేసిన పక్షి పిల్ల రక్తం ముద్దలా ఎర్రటి పెదవులపై తడి ఆరని చారలున్నాయి. వాటి వెనక తెల్లటి పళ్ళు తళతళ-తన మొహం ఎందుకో యీ పూట కొత్తగా వుంది. లంక ణాలుచేసి పథ్యం పుచ్చుకున్న తర్వాత, ఏదో కొత్త చోటునుంచి తిరిగొచ్చిన తర్వాత, ఎవరి మొహాన్నో ఎరువు తెచ్చుకున్నట్లు, ఆ క్షణిక వికాసం అద్దంలో ప్రతిబింబించింది. ఆ అందంలో అద్దంలో వుంది-తనలో కాదు. ఒక్కొక్కరకం అద్దంతో మొహం వికృతంగా కనబడుతుంది, కొన్నిటిలో లేని చక్కదనం కనబడుతుంది. తను నుంచున్న చోటు, వెలుగుపడేవైపు, వెలుగు తీక్షణత - ఎన్నింటి పైననో ఆధారపడుతుంది అద్దంలో బింబం. రాత్రంతా నిద్రపట్టక తెల్లారి బరువు కళ్ళతో చూసుకుంటే ఎంత అందంగా కనబడుతుంది! ఆదేం చిత్రమో!

వెనక్కి తిరిగింది. మధుసూదనం.

"రండి వెడదాం."

ఆమెకేసి చూడ్డంలేదు. బట్టలు మార్చుకుంటున్నాడు. తనకేసి చూడడేం? చూడవల్సిన సమయం ఇదే. అతనిపైన కోపం వొచ్చింది. చూడకుండా వుంటాడూ? తను చూడనప్పుడు చూసి, మళ్ళా తను చూసినప్పుడు, చూడనట్లు - గంద్రగోళంగా వుంది.

జీప్‌లో మలుపుల రోడ్డంట దిగుతున్నారు. ఐదు నిమిషాల్లో ఎల్లోరాగుహల దగ్గర చేరుకున్నారు. జనం అట్టే మందిలేరు. ముందు రోడ్డు వూడుస్తున్నారు. టీ దుకాణం దగ్గర కొందరు చేరారు—స్త్రీలు పురుషులు. ఆమెవరో పార్సీ స్త్రీ—నల్లటి సన్‌గ్లాసెస్ పెట్టుకుంది. ఖజాన కెమేరా, లోపల ఫొటోలు తియ్యకూడదుట, లోపలి కెళ్ళారు.

మరో ఇద్దరు వారిముందు నడుస్తున్నారు. వారిని వెళ్ళనిచ్చి చూస్తూ వెడుతున్నాడు మధుసూదనం. ఇట్లాంటి శిల్పాలు తను ఉత్తర హిందూదేశంలో చాలా చూసింది. దిల్వారా ఆలయం

భువనేశ్వరం. కుజరాహో....ఇవీ అల్లాగే ఉన్నాయి. కైలాసం ప్రసిద్ధశిల్పం. అతి ప్రాచీనమైనది—పదహారువందల సంవత్సరాల క్రితంది. ఇవన్నీ బౌద్ధశిల్పాలు. పెద్దవి, భీకరంగా వుంటాయి. మధు చేతులతో శిల్పాలని తడుముతున్నాడు.

"మీకు చదరంగం నేర్పనా?"

"నాకు చదరం ఎత్తులు తెలుసు—ఏది ఎట్లా నడుస్తుందో-"

"ఇట్లా రండి."

అక్కడ చీకటిగా వుంది. భయ మేస్తోంది. స్తంభాన జేర్లబడింది. అతను దూరంగా వెళ్ళి తన పక్షంకేసి చూస్తున్నాడు. లాల్చీ జేబులోంచి టేపుతీశాడు. దగ్గర కొచ్చాడు. నిలువునా టేపు వేళ్ళాడేసి కొలత చూస్తున్నాడు. బుజాల వెడల్పు కొలుస్తున్నాడు.

"ఏమి టిదంతా?"

నవ్వుతాడు.

"వెర్రి."

మెడచుట్టూ కొలుస్తున్నాడు. అతని శ్వాస తనమీద పడకుండా మొహం తిప్పేశాడు.

"ఇంక రండి."

వెడుతున్నారు.

"ఇక్కడ నిలబడండి. మోకాలు మడిచి నిలబడండి?"

తనకి చేతకావడంలేదు. తన పాదంపైన చేతులుపెట్టి పైకి వొంచుతున్నాడు.

"ఏం పనది?"

"శివుడు. పార్వతి చదరంగం ఆడుతున్న శిల్పం ఇది. జన్మ రాహిత్యం అయ్యేవరకూ మనిషి జన్మలెత్తుతూ ఉంటాడంటారు మన పెద్దలు. పదహారువందల సంవత్సరాల క్రితం మీరు ఇక్కడే కూర్చున్నారు. చదరంగం ఆడుతున్నారు. ఆనాటిశిల్పి మీ చిత్రం రాతిమీద చెక్కేశాడు. దైవంపేరిట వారి సౌందర్యతృష్ణ తీర్చుకోవాలి. పాపం పూర్వం వాళ్ళు. అదోదగా. అందరూ మెచ్చుకుంటారు. ఆ శిల్పిని నేను మాత్రం కాను."

"ఇది నాలా ఉందంటావా?"

"అనను."

"మీరు దానిలా అయ్యేవరకూ జన్మలు ఎత్తుతూనే ఉంటారు."

"పిచ్చి."

"తప్పకుండా పిచ్చే. కాని అందమైన పిచ్చి."

మళ్ళా వెడుతున్నారు.

"నదీదేవత—ఆ కళ్ళల్లో కన్నీరు జారి నదిగా ప్రవహిస్తోంది" అంటున్నాడు.

"నాకేం కనబడ్డంలేదు"

"ఊహ పురుషుడు -శరీరం స్త్రీ. దేవత నదీప్రవాహం - పురుషుడు వొడ్డు మట్టిముద్ద స్త్రీ-శిల్పి పురుషుడు...."

"భ్రమ."

"భ్రమకాదని ఈ భైరవుడీ మూర్తిని చూస్తే తెలుస్తుంది."

రాతి భైరవుణ్ణి చూస్తే భయమేస్తుంది. మధు మళ్ళా మొదలెట్టాడు.

"మెడలో పుర్రెలమాల. మృత్యువు తాండవించినట్లు - పుర్రెలు మద్దెళ్ళు; దారం వీణతీగె; సృష్టి సమర్పించిన రక్తం, మాంసం, కండ. ఎముకలు—పీల్చి పిప్పిచేసి, ఆ మెరిసి పొయ్యే నేత్రాలు పీకేసి, రెండుకంతలు మిగులుస్తాడు భైరవుడు. ఆడా మగ వ్యత్యాసాలులేవు. మనస్సు కనబడదు. ఊహించాలి, ఊహించే శక్తి ఒక్కటే మానవుడి సొత్తు."

పన్నెండు బౌద్ధగుహలు తిరిగేటప్పటికి తనకి అలుపొచ్చింది. చెమటబిందువులు నుదిటిమీదనుంచి జారుతున్నాయి. బైటకొచ్చి నిలబడింది. పన్నెండు దాటుతోంది. మహిషాసురుణ్ణి చూస్తున్నాడు అతను. ఏవో కొలతలు కొలుస్తున్నాడు. వొచ్చాడు. జీప్‌లో బైలు దేరారు. పాకలో కెళ్ళారు. భోజనం ఏర్పాట్లు చేస్తున్నాడు షూజా. లోపల్నించి ఓ అమ్మాయి వొడ్డన కొచ్చింది. నల్లగా, పొట్టిగా వుంది. చింపిరిజుడ. మెళ్ళో ఎర్రపూసల హారం—పచ్చగాజులు, డో కొస్తుంది. స్నానం చేసిందా? ఆ ఊదారంగు చీ రెక్కడ దొరికింది?

"ఆమె ఎక్కడ అని అడిగారు. ఈమే ఆమె.'' అ
ఆ పిల్ల వెళ్ళినవేపు చూపుతూ.

ఆశ్చర్యమేస్తుంది. ఇదెక్కడ దొరికింది? తన కక్క
వెళ్ళిపోవాలనుంది ఛి, ఛి!

"పేరు—తుక్కమ్మ'' అని నవ్వుతున్నాడు.

"తగినపేరే."

తనూ నవ్వుతోంది. ఇద్దరూ విరగబడి నవ్వుతున్నారు.

"తుక్కమ్మది ఔరంగాబాద్ దగ్గర ఓ పల్లెటూరు. గొ
కాస్తుంది. వొస్తూంటే కనబడింది. ఆ పని యీ పని చెయ్యడా
రమ్మన్నా. ఒప్పుకుంది ఘాజాని పెండ్లి చేసుకోమంటున్నా. వా
తనకి నచ్చలేదుట. ఘాజా దేవపురుషుడు-అంటే వాడి శరీరం''

"ఛీ, ఛీ!"

"శరీరంపట్ల మనకి గౌరవం పోయింది. శివలింగపు
ప్రాధాన్యం పూర్వులు పొగిడినా, యీనాడు శరీరం శక్తిపట్ల ఆదర
లేదు. ప్రతిభాశాలులైన ఒకరిద్దరు శిల్పులు రాయిద్వారా యీ సూత్రం
చాటుతున్నారు. ఆధునిక శిల్పానికి మొహం ఉండదు—స్ఫుటమైన
ఆకారంలో ముఖ్యమైన కోణాలు మాత్రం ఉంటాయి. అట్లా
ప్రదర్శిస్తే, కళ్ళు తెరిచి శరీరం చూస్తారని. కాని చూడ్డంలేదు.
ఎగ్జిబిషన్స్‌లో పెడుతున్నారు. శిధిలయాలకింద జమకట్టి, పురావస్తు
శాఖవారికి వప్పగించేస్తారు. మరొకరి శరీరం చూడలేనివారు, తమ
శరీరాలు చూసుకోలేరు.''

తుక్కమ్మది చిన్నిముక్కు—చేపపిల్లలాంటి చిన్ని కళ్ళు—
నల్లజిగురుచెట్టు బెరడులాంటి ఛాయ.

"నల్లరాతిలో చెక్కిన స్వప్నం'' అన్నాడు మధు ఆమెను
వుద్దేశించి.

ఛీ, ఛి అట్లా గంటా దేమిటి? గబగబ భోజనంచేసి చెయ్యి
కడుక్కుంది. పక్కచుట్ట అమర్చింది తుక్కమ్మ—దానిచేతులతో
తాకిన పక్కమీద ఎల్లా పడుకోడం?

షూజా సరుకులు తెస్తానని వెళ్లాడు. నిద్రొస్తోంది. పడుకుంది జ్ఞానసుందరి.

రెండైంది. మెళకువొచ్చింది. ఏదో చప్పుడు. సుత్తితో రాళ్ళని కొడుతోన్నట్లు. లేచి చూసింది. ఎవ్వరూ కనబడరు. పాకలో మధ్య పరదాలా అమర్చిన గుడ్డవెనక ఏదో చప్పుడు. కిందనించి చూసింది. ఆ పిల్ల-తుక్కమ్మ-వివస్త్రఅయి నిలబడింది. అటుతిరిగింది. కదలకంతా నిలబడింది—నల్లరాయిలా. మధు కొలతలు కొలవడం. మళ్ళా ఎదురుగాఉన్న ఎర్రరాయిమీద సుత్తితో కొట్టడం—తెలిసింది. ఆమె శరీరం ఆధారంగా, రాతిమీద శిల్పం చెక్కుతున్నాడు. గబగబ వెళ్ళి పడుకుని కళ్ళు మూసుకుంది.

రాతిమీద సుత్తితో కొడుతున్నాడు—చప్పుడు ఆమె నరాలని కోస్తోంది—శరీరంలో ఏదో వేదన, లోపలనుంచి గుండెలు శరీరం పైన కొడుతున్నట్లు—ఉద్రేకాల విప్లవం—దొడ్లోకి వెళ్ళి మొహాన చన్నీళ్ళు జల్లుకుంది. అవతల చెట్లు ఎండలో మాడుతున్నాయి. రాళ్ళు గుడ్లెర్రజేసినట్లు కాలుతున్నాయి. అంతా వేడి—కాఠిన్యం జ్వాల

టీ తాగాలని వుంది. షూజా లేడు. తనే పాలడబ్బా కోసం వెదికి, టీ పెట్టుకుంది.

"మీ కెందుకు శ్రమ. ఆపిల్ల పెడుతుందిగా" అన్నాడు. మధు లోపలి కొచ్చి.

"దాన్ని పంపించివెయ్యి."

"అదేం చేసింది?"

"నాకేదో చిరాకుగా వుంది."

అతను వెళ్ళాడు. లోపల ఏదో గుసగుసలు. మళ్ళా సుత్తి దెబ్బలు. రాతిముక్కలు నలుదిక్కులా ఎగిరిపడుతున్నాయి. తనముందొకటి పడింది. నల్లరాతిపెంకు. తడిమితే వేడిగా వుంది. తొందరగా లోపలి కెళ్ళింది.

"కాసేపు ఆపు" అని గర్జించింది. నిలిపాడు.

"ఇదంతా ఏమిటి?"

"మీకేం కష్టం?"

"ఆ పిల్లతోనా....?"

"ఏదో వొక ఆకృతి వుండాలిగా."

"పెండ్లాం వుందిగా."

"మీలాగే ఇట్లాంటి పనులు చిరాకు. ఈ పనిలో ... హోదా లేవు. నిరుపయోగమైంది. అట్లా కూర్చుంటుందా. ని... తుందా.....మీకు తెలీదు?"

"దాన్ని పంపించివెయ్యి."

దగ్గరగా వొచ్చాడు. చెవులో రహస్యంగా చెప్పాడు.

"ఛ, ఛ—నేనా—? మంచివాడివే—నీకు మతిపోయిందా"

"కోపమైతే అడగనులెండి...."

"సిగ్గులేదూ?"

"సిగ్గువల్లే నిజమైన శక్తుల్ని హరింపజేసుకుని వికాసం... వృధాజీవితాలుగా తయారవుతున్నాయి మన బ్రతుకులు. ప్రాచీను... కివి లేవు. ఉంటే అజంతాచిత్రాలు. ఎల్లోరా శిల్పాలు ఉండవు. ... పిల్లకి రూపాయి కావాలి. ఇంకేమీవొద్దు. మరి నాకెవ్వరూ దొర... లేదు. ఏం చెయ్యను?"

"నువ్వు శిల్పివా? ఎప్పుడూ ఇట్లాంటివి ఇంటిదగ్గర చెయ్య... లేదే!" అన్నది తాను.

"శిల్పిని కాను. నేనెవర్నీకాను. నాకు వ్యక్తిత్వం లేదు... భార్యకి డబ్బు గడించిపెట్టే నౌకర్ని. పిల్లల్ని స్కూలుకి తీసికె... అయాను. జ్వరంవొస్తే టెంపరేచర్‌చూసే నర్సుని. రాళ్ళ పరిశో... నా ఉద్యోగం. ప్రొమోషన్ లేదు. నేనొక రాయి నయినాను. ... మయ్యే స్థితిరాకుండా, నేనేర్చుకున్న ఆ ఒక్క పాఠాన్నీ ప్రకటిం... లంటే రాళ్ళే అనువైన పరికరం. శిల్పం చేతకాదు. రాయితప్ప... మరొకటి నా కర్థమవదు. ఆస్ట్రేలియానుంచొచ్చిన ఆ దొరగారిదగ్గ... పద్ధతి తెలుసుకున్నా; పరికరాలు కొన్నా. ఆయన సహాయంతో కొన్ని... సూత్రాలు ఆచరణలో పెట్టాను. చూడండి."

మూలనున్న బుట్టపైన కప్పిన గోనిసంచీ తొలిగించాడు... ఎరుపురంగు మూడడుగులఎత్తు బొమ్మ. పురుషుడు మోకాళ్ళమీ...

వొంగి, ప్రాకుతున్న చిత్రం. మోకాళ్ళు మోచేతులు కణుపులు కట్టిన ట్లున్నాయి. పేగులు కనబడుతున్నాయి. ప్రక్కన నిలబడిన మరో ప్రతిమ—స్త్రీలాగుంది. ఇంకా పూర్తికాలేదు.

"పురుషుడు స్త్రీకి బానిసకావడం—అన్నది నే చెప్పదల్చిన భావం, 'స్వేచ్ఛ' అనే విషయంపై శిల్పాలపోటీ జరుపుతున్నారు కలకత్తాలో. ఈ భావం స్ఫురించింది-ఆస్ట్రేలియా గురువు నవ్వాడు కాని, చివరికి ఆమోదించాడు. ఆయనభార్య ఆయనకి విడాకు లిచ్చింది."

"ఇప్పుడు నీకేం లోటొచ్చింది?"

"ఏం లోటు లేదు—అదీ ఒక లోటే. నేను చెయ్యదల్చు కున్న వాటిని చెయ్యనివ్వడం, దానివల్ల ప్రయోజనం లేకపోయినా—అంతే నేకోరేది...."

"అవి చెడ్డపనులైనా కూడానా?"

"ఒకరి దృష్టిలో చెడ్డకావొచ్చు."

"నువ్వు చెప్పింది నిజమైతే, అసలు సంఘంలో నీతి. మంచి అంటూ వుండవు"

"మామూలువాళ్ళకి నీతి. మంచి వుండాలి—కాని ఏ ఒక రిద్దరో అసాధారణ వ్యక్తులుంటారు. ప్రతి సంఘంలోనూ, వారికి స్వేచ్ఛ వుండాలి. ఉంటేనే ఏదో వొక ఘనకార్యం చెయ్యగలుగు తారు. సంస్కృతి. నాగరకత వారివల్లనే వృద్ధి చెందుతాయి. ఈ యథార్థం సంఘసంస్కర్తలు గుర్తించే వరకూ ప్రతిభాశాలుల కృషి ఫలించదు."

"నువ్వు అసాధారణ వ్యక్తివా?"

"కాను. ఏమో, ఒకయత్నం చేస్తాను. అది ఫలించకపోతే మామూలు మనిషినే, ఇదంతా విడిచిపెట్టి, పిల్లల్ని కంటూ, నెలజీతం భార్య కిస్తూ. నౌకర్‌లా, మంత్రసానిలా మామూలు జీవితం సాగిస్తాను." అన్నాడు.

ఇదంతా ఏదో గొడవగా వుంది. తన కీ సమస్యలు లేవు. భర్త లేడు. సంసారం లేదు. స్వేచ్ఛాజీవి. తనచిత్రం చెక్కొచ్చుగా!

ఇందాక అడిగినప్పుడు ఊఁ అనకూడదూ! అప్పుడు ఛ, ఛ అని సీ
రించుకుంది. ఇప్పు డింక వెనక్కి వెళ్ళడానికిలేదు. బెట్టుగా వుండాలి
అతను దొడ్లోకి స్నానాని కెళ్ళాడు. బొమ్మని దగ్గరగా చూపింది
వేళ్ళతో తాకింది. ఎర్ర ప్లాస్టర్ ముద్దలో తయారైన చిత్రం
మోకాళ్ళమీద మనిషి జంతువులా వున్నాడు కాని, మనిషిలా లేడు
తువ్వాలుతో వొళ్ళుతుడుచు కుంటున్నాడు, బట్టలు ఆరబెడుతున్నారు.

"ఆ పిల్లేదీ?"

"పంపించివేశాను."

"మరి నీ పనికి అక్కర్లేదూ?"

"నాకు తెలుసు. మీకు పరస్త్రీ పంచనుండటం గిట్టదని."

"ఛీ, ఛీ! నాకదంటె అసూయా?"

"మీ క్కాదు. దానికి మీరంటే అసూయ వుండొచ్చుగా,
ఈ పూట కదలకుండా కూర్చోలేక పోయింది. అటు, ఇటూ చూడ్డం,
మెడ తిప్పడం, కాళ్లు తిమ్మెర్లు—అన్నీ అంతరాయాలే. దానికి
హృదయం లే దనుకున్నా. పొరబాటు. అదీ మనిషే—పంపించి
వేశాను...."

దిగులుగా వున్నాడు. దగ్గరగా వెళ్ళింది తను.

"కోపం వొచ్చిందా?"

"ఎందుకు?"

"నే నల్లా అన్నందుకు."

"లేదు. పెద్దకార్యం సాధించాలంటే శిక్షణ, సాధన, కావాలి.
ఉద్రేకాలకు గురి కాకూడదు. కోపానికి గురైన వాళ్ళు కారాగార
శిక్షపొంది, జైళ్ళలో రాళ్ళు కొడుతూ వుంటారు. శిల్పాలు
చెక్కరు."

"ఈ రాతి బొమ్మ ఏమిటి?"

"ఆ చిన్నది ప్లాస్టర్ శిల్పం, అది వూరికే మోడల్. దాన్ని
ఆధారంగా రాతిమీద చెక్కాలి. పచ్చ మారుబుల్ రాయిని సంపాదిం
చాను. పురుషుడి బొమ్మకు షూజా ఆధారం. స్త్రీ ప్రతిమ పూర్తి
కావాలి. నమూనా దొరకడం లేదు. స్త్రీ ఠీవిగా నిలబడి. ఆ వొంగిన

పురుషుడి ప్రక్కన చేతిలో గరిట పట్టుకున్నట్లు చిత్రించాలి. అతను బానిస—ఆమె యజమాని. ఆమె ఆయుధం అట్లకాడ. అతని ఆశయం. యజమానిరాలికి కోపం రాకుండా, దగ్గరలోనే వెనక పాకుతూ పోతూండడం....''

మళ్ళా నవ్వుతున్నాడు. రాతి బండ నాలు గడుగు లుంది. తలకాయ స్వరూపం మాత్రం, గుండ్రంగా, బంతిలా చెక్కబడి వుంది. ఎదురుగా మరో రాయి వుంది. దాని మీద కూర్చుని, రాతి కేసి చూస్తోంది అతను రాడేం? బైటకొచ్చి చూసింది, అక్కడ లేడు. తను కూర్చున్న రాయి మీదనే ఇందాక ఆ పిల్ల కూర్చుని వుంది. ఆ రాతిని ఒక్క తాపు తన్నింది. అది దొర్లింది, రెండు ముక్కలైంది. పాదం మండుతోంది.

జీప్ లేదు. గుహల్లోకి వెళ్ళుంటాడు. తను బైటికి నడిచింది. గుహల దగ్గరకి వెళ్ళటం ఎట్లా? చాలా దూరం. సూర్యాస్తమయం చూడ్డానికి వెళ్ళుంటాడు, కొండపైకి. మలుపు తిరిగి కొండమీదికి నడుస్తోంది. అరగంట నడిచింది. అలు పొచ్చింది. అక్కడ రాతిమీద పడుకుంది. సూర్యుడి కేసి చూసింది. సూర్యుడు నూనెలో మంట ప్రతిబింబంలా మసగ్గా వెలుగుతున్నాడు. వేటకాడు పొదిలోకి అంబులు దింపుకుంటున్నట్లు, కిరణాలు దిగిపోతున్నాయి. క్రూర మృగాలు వేటకాడిని చుట్టుముట్టినట్లు నల్లమేఘాలు కుంటుకుంటూ దిగిపోతూన్న సూర్యుణ్ణి తరుముతున్నాయి. పిల్ల మేఘాలు చెదిరి పోతున్నాయి. ధైర్యం చెబుతూ సుడిగాలి రేగింది. సూర్యుడుగాయ పడ్డాడు, పడినచోట రక్తం చిమ్మినట్లు కాస్తంత ఎరుపు ఆకాశం అంచుని పట్టుకుంది. రక్తం తాగడానికి అడివి మృగాలైన మేఘాలు ఆ కాస్త చోటూ మూసేశాయి. గాలి విజృంభించింది. మేఘాలు ఒకదానిమీద ఒకటి పడి కొట్లాడుకుంటున్నాయి.

జ్ఞానసుందరికి పమిట వుండటంలేదు. జడ వూడింది, చీర లేచి పోతోంది. మొహాన ఆకులు, దుమ్ము, కీటకాలు పొడుస్తున్నాయి. ప్రకృతి తరుముతోంది. గాయపడిన సూర్యుడి గుండె పగిలినట్లు ఉరుములు, చినుకులు పడుతున్నాయి. యవ్వనంతో విర్రవీగినట్లు

చినుకులు ధారైనాయి. ఆమె పరుగెడుతోంది. పాక చాలా దూ...
వుంది. తడిపి ముద్దవుతోంది. ఏం చెయ్యడం? పెద్ద రాతిబండకింద
కా స్తంత నీడుంది. ఆ బండ కింద అవతలవైపు మనిషి అ...
దైంది. మధుసూదనం.

"మీ రిల్లా ఎందు కొచ్చారు?"

"నువ్వేందు కొచ్చావు?"

"రాళ్ళు ఏరుదామని."

చలితో వొణికి మాట తిన్నగా రావడం లేదు. తన లా...
తీసేశాడు.

"నెత్తిన కప్పుకోండి."

దగ్గరగా జరిగింది. అతని వక్షం మీద తల ఆనించి. లా...
పైకి లాక్కుంది. అటు తిరిగాడు. దూరంగా వెళ్ళాడు. గట్టిగా అత...
నడుం పట్టుకుంది. విదిలించాడు. మోకాళ్ళు పట్టుకుంది—చేతులతో
ఆమెని పైకి లేవనెత్తాడు.

"అటు చూడండి."

"బాబో—ఏమిటది?"

"నాగరాజ్యలక్ష్మి."

"ఎక్కడా—భలేవాడివే."

నవ్వుతున్నాడు-వొణుకుతూ. ఉంగరాల జుట్టు కాడలలా కళ్ళ
మీద పడుతోంది. అతని గెడ్డం ఆమె బుజాల మీద గుచ్చుకుంటోంది
అతని మెడ చుట్టూ చేతులు వేసి రొమ్ములు వీపు మీద నొక్క-
తోంది.

"రండి వెడదాం. ఇప్పట్లో తగ్గదు."

"దోవ కనబడదు. భయంగా వుంది."

"నా వెనకాలే రండి." మెరుపు తీగలు ఆకాశంలో చీకటి
బాధని వెలిగిస్తున్నాయి. అతన్ని పట్టుకుంది. ఆమె పట్టు విదిలించు
కున్నాడు. చేతిని గట్టిగా బిగించి పట్టుకుంది. నడుస్తున్నాడు. తను
నడుతోంది. చేయూత నిస్తున్నాడు. పాదాల కింద రాళ్ళు పొడుస్తు
న్నాయి. గడ్డిలో ముళ్ళు—'అమ్మో. చచ్చాను' ఎగిరి గంతేసి అతన్ని

కౌగలించుకుంది. సన్నటి ఛాతీ మీద ఆమె హస్తాలు బిగిశాయి. తీగలలాంటి వేళ్ళతో పట్టు విప్పి వేళ్ళని పట్టుకున్నాడు.

"తిన్నగా నడవండి."

"భయంగా వుంది."

"వొచ్చేశాం."

వర్షం దిక్కు మారింది. వెనకనుంచి పొడుస్తోంది. ఆమె ముందు, అతను వెనుక. నిలబడిపోయింది. అతని చేతులు తీసుకుని వక్షం పైకి లాక్కుంది. జడ వూడి అతని చేతుల మధ్య ఇరుక్కుంది. గాజులు పటుక్కుమన్నాయి. విదిలించుకున్నాడు. పరుగెడుతున్నాడు. తనూ వేగంగా నడుస్తోంది. మాట రావడం లేదు. గుండె దడ. కాళ్ళు పట్టులేవు. పడిపోతోంది. మోకాళ్ళమీద పడింది. అతను లేవదీశాడు, ఆమె బుజాన్ని తన చేతుల మీద ఆనించి నడిపిస్తున్నాడు. వేళ్ళాడిపోతోంది. బరువంతా అతనిపైననే. కుంగిపోతున్నాడు. పూజా గుడ్డి దీపంతో, గోనిసంచీ నెత్తిని కప్పుకుని వాళ్ళ కేసి వొస్తున్నాడు. ఇద్దరూ సాయంపట్టి, ఆమెని పాకలోకి జేరవేశారు.

"వర్షం తగ్గాక జీపు తీసుకురా"

"అందుకే పోతుండా."

లోపల చీకటి. పక్క మీద పడుకోబెట్టాడు. దుప్పటీ కప్పాడు. పొయ్యి ముట్టించాడు తువ్వాలు, పొడిచీర మీద పడేశాడు, తను లేవలేదు. తడి బట్టలతో అలానే పరుంది. ఆమె పైన బ్యాటరీ లైటు వేశాడు. చీర వొంటికి చుట్టుకుంది. తడికి వొళ్ళంతా కనిపిస్తోంది.

"దుస్తులు మార్చండి."

తను మాట్లాడలేదు.

"టీ తీసుకోండి."

తను లేవలేదు. తల కింద చెయ్యి పెట్టి, పైకి లేవదీసి కూర్చోబెట్టాడు. టీ గ్లాసు పెదవులకు తగిల్చాడు. అతని నడుం

పట్టుకుని కూర్చుంది. వొదిలించుకుని, జరిగి దూరంగా కూర్చున్నా

"అమ్మో. నన్నొదిలి వెళ్ళకు, భయమేస్తోంది."

"భయం దేనికి? ఇంటికి చేరుకున్నాంగా" సీరు పర

చుట్టూ పొంగుతోంది. గాలికి కర్రలు కదిలి పడాయి అ

కట్టిన తాడు, పరదా, అన్నీ కిందకి కూలాయి. పైన వేసిన

రెపరెపలాడి కొట్టుకుపోయింది. పొయ్యి ఆరిపోయింది. చీకటి అ

కారం. అతన్ని వెదుకుతూ అటూ యిటూ కదులుతోంది. ఏరి

కనబడడేం?

"ఎక్కడ?"

"ఇక్కడ. భయం లేదు. తగ్గిపోయిందిలెండి."

పర్షం తగ్గింది. గాలి నీరసించింది. తెచ్చిపెట్టుకున్న కపితో

వుండి వుండి వో చినుకు నేలని వెదుక్కుంటూ పడుతోంది.

"నాకేం కనపట్టంలేదు. ఎక్కడ?"

"ఇక్కడే—తగ్గిపోయిందిగా-మీ రా తడి బట్టలతో గంగా

దేవివలె ఉన్నారు. మీకే భయమా? మీ చెల్లెలికి భాగవతం చె

పించేది మా అత్తయ్య—జ్ఞాపకం వుందా? గంగాదేవి అంటుంది

వినువీధిం బఱతెంచి నేలబడ నా వేగంబునున్ నిల్పనో

పినవాడెవ్వడు మేదినీతలము నే భేదించి పాతాళముం

జనుదున్ వచ్చితినేని నా జలములన్ సంస్నాతులై

మానవుల్

నను బొందించు నఘవ్రజం బెచట నే నాశంబు

బొందించెదన్—

అల్లాగ మీకు భయ మేమిటి?"

తన కర్థం కావడం లేదు. తను ఏం నాశనం చేసింది?

"నేను నాశనం ఏం చేశాను?"

"మీకే తెలుసు!"

షూజా వొచ్చాడు, వాడి చేతులో దీపం కాస్తా ఆరింది,

మళ్ళా ముట్టించాడు. లేచింది తను. దుస్తులు మార్చుకుంది. షూజా

పొయ్యి ముట్టించాడు. తడక బిగించాడు. పరదా లేవనెత్తి, తాళ్ళతో

కట్టాడు. తడిబట్టలు ఆరబెట్టాడు. తను పక్కగా వెళ్ళి రాతి మీద కూర్చుంది.

మధుసూదనం దీపం తీసుకొచ్చాడు. చేతులో సుత్తి వుంది. దీపాన్ని ఎత్తుగా తాడుతో కట్టాడు. ముసిలినీడ కళ్ళల్లో పడుతోంది. చుట్టూ కీటకాలు, చేత్తో తోసేస్తోంది.

"నుంచోండి."

"ఎందుకు?"

"అడక్కండి."

నిలబడింది. బైట కప్పలు బెక బెకలు సాగించాయి. కీచురాళ్ళు విజృంభించాయి. దీపం సన్నగిల్లుతోంది. అతను సుత్తితో రాతిని చెక్కుతున్నాడు. పొడుం అవుతోంది. బెల్లాడి పడుతోంది. ఎంతసేపు? కాళ్ళు లాగుతున్నాయి. కూర్చుంది.

"నిలబడాలి."

"నావల్ల కాదు."

కూర్చునేవుంది. పురుగుల్ని తోసేస్తోంది.

"కదలకండి."

డిటెక్టివ్‌లా గాలి కెరటం వీచింది. దీపం ఆరింది త్రుళ్ళిపడి అతనిమీద వాలింది.

"మీరు కదలకూడదు."

"చస్తోంటే శిల్పం ఏమిటి?"

"ఓపిక పట్టలేరు?"

మళ్ళా నిలబడింది.

"అటు చూడండి."

దీపం ముట్టించాడు. దానిచుట్టూ కాగితం పెట్టాడు. ఎదురుగా మరో తాడుకి టార్చిలైట్ కట్టాడు. దాని వెలుగు తన మెడమీద పడుతోంది. ఎదురుగా తువ్వాలుమీద తన నీడ పడుతోంది—వక్షం నీడ పెద్దదిగా, అతిశయోక్తిగా పడుతోంది. చేతులతో కప్పుకుంది. గిరగిర తిరిగింది, కూర్చుని మళ్ళా అతనిమీద వాలింది, మెడచుట్టూ చేతులేసింది. విదలించుకున్నాడు.

''ఒక్క క్షణం నిశ్చింతగా, కదలకుండా దీక్షగా వుండలేరు?''

అవేంమాటలు, దీక్షేమిటి? తనిప్పు డేంచేసింది? మధుసూదనం అవతలి భాగంలోకి నడిచాడు. షూజా రొట్టెలు తయారు చేసి, వొడ్డించాడు. ఆకలిగా వుంది. తింటున్నారు. అతనికేసి చూళ్ళేకపోతోంది. అతనంటే రోతగా వుంది. దీక్షట. తన జీవితం అంతా దీక్షే. ఇందాకమట్టుకు.—అదుగో నాగరాజ్యలక్ష్మివి చూడు అని బెదిరించాడు. తను అక్క, ఆమె చెల్లెలు. చెల్లెలు భయపడాలి. చెల్లెలు ప్రవర్తన సరిగ్గా లేకపోతే. తను అజమాయిషీ పెట్టాలి. తన కేం భయం?

''అవి చన్నీళ్ళు. త్రాగకండి. ఇవిగో వేడినీళ్ళు. ఇవి త్రాగండి.''

వేణ్ణీళ్ళు త్రాగింది. భోజనా లయ్యాయి. చెల్లెల్ని గురించి ఆలోచిస్తోంది. ఈపాటికి తనిక్కడవున్న విషయం. యాత్రనుండి తిరిగెళ్ళిన స్నేహితురాండ్రు తెలియపరిచే వుంటారు. వారిని గురించి ఊహించుకుంటూ వుంటుంది నాగులు.

షూజా పెద్ద బంగళాలో కెళ్ళి—మరో పెద్ద దీపం తెచ్చాడు. ఆవలింత లొస్తున్నాయి. నిద్రొచ్చేస్తోంది. కళ్ళు మూతలు పడుతున్నాయి. మధుసూదనం పక్కచుట్ట పెద్దదిగా చేసి అడ్డంగా మడిచి దానిమీద ఆమె వెన్ను వాలేటట్లు పడుకోబెడుతున్నాడు. పడుకోడం కాదు—కూర్చునేవుంది. తలమట్టుకు. పక్కచుట్టమీద ఆనింది. పడక కుర్చీలో కూర్చున్నట్లుగా వుంది. కనురెప్పలు లేవడం లేదు. పెద్ద దీపం వెలుగు పల్చగా రెప్పలమీద పడుతోంది. నిద్రలో తనెక్కడికో జారిపోతోంది. చీకటి గుహలు, ఎర్రటి సూర్యబింబం. వీనస్ గ్రహం. గిలగిల తన్నుకుంటున్న దీపంబుడ్డి. పట్టాలమీద రైలు చక్రాల లయ. త్రిమూర్తి వొంటిమీద బీట, సముద్రంలో పిల్లకెరటం—గాలి, గడ్డిపువ్వు. అతని గడ్డం మొనలు. తన వక్షంపై తీగలాంటి వేళ్లు. ఎక్కడికో వెళ్ళిపోతున్నట్లుంది. ఆలోచన లేదు. ఊహ లేదు. ఏదో చప్పుడు. ఎవరో సుత్తెతో తన గుండెలపై కొడుతో

న్నట్లు. అబ్బ అయ్యో—బాధ. బాధలో సుఖం—నిద్రలోకి. ద్రలోకి ....లోకి....కి....

* * *

జ్ఞానసుందరి లేచి కళ్ళు తెరిచి తన చుట్టూ చూసేటప్పటికి ఏడు దాటింది. తన వొంటికేసి చూసుకుంది. మామూలుగానే వుంది. ఎలకలు కొరకలేదు. పక్షులు పొడవలేదు—మనస్సు నిశ్చితంగా, బలంగా తేటగా వుంది. రాత్రి నిద్ర బాగా పట్టింది. మొహం కడుక్కుని, టీ త్రాగింది. స్నానం చేసింది. రాత్రి ఆరేసిన చీర బాగా ఆరలేదు. మళ్ళా ఆ చీరే కట్టుకుంది.

“అయ్యగా రేరీ?”

“అల్లా వెళ్ళారండి.”

తనకి తోచడంలేదు. అల్లా నడిచివెళ్ళింది. సూర్యుడి వెలుగులో ప్రకృతి తలంటుపోసుకుని కొత్తబట్టలు ధరించినట్లుగా కలకల్లాడుతోంది. దాహం తీరిన నేల పెదవులు ముడుచుకుని పరున్నట్లు, బీటలు ఎండపెట్టుకుంటోంది. పాయలుగా. చారలుగా. చీరమడతలుగా నేల విడి. కలిపింది. పచ్చగడ్డిమీద నీటికణాలు వజ్రాలలా మెరుస్తున్నాయి. పాదాలకింద తడి చూసుకొచ్చి, కదలికను అరికడుతోంది. పక్షులు రెక్కలు ముడుచుకుని శాలువా కప్పుకున్నట్లు ప్రభాతగానం చెయ్యలేక, దగ్గరగా జరిగి, చోద్యం చూస్తున్నాయి. భూమిలోంచి తడి. రాళ్ళమీద వేడి ద్వంద్వాలతో తన శరీరాన్ని మభ్యపెడుతున్నాయి. నగ్నంగా నేలమీద పడి, సూర్యుడికి నమస్కరించా లనిపిస్తుంది. ప్రకృతి ఆమెని కడిగి పవిత్రం చేసిన ట్లయింది. ద్వేషం లేదు. రాగంలేదు. కోరికలేదు. తనిప్పుడు మరణి స్తే స్వర్గానికే వెడుతుంది. సీతాదేవిలా భూమి విడి ఆమెని కౌగలించుకుని లాక్కుపోతే బావుండును.

తొమ్మిదైంది. జీప్ చప్పుడు. అతను దిగాడు. మరొక వ్యక్తి కూడా దిగాడు. ఇద్దరూ పెద్ద కర్రపెట్టెని దించుతున్నారు. పాక ముందు.

రాత్రి తాను చేసిన విషయాలు జ్ఞానసుందరికి జ్ఞాపకం రావడం

లేదు. ఏ మందిః ఏం కావాలిః ఏం మాట్లాడిందిః ఆ గాలి, ఆ వర్షం-తను మరో అవతారం దాల్చింది. ఎవ్వరికీ అర్థం కాదు. అతని కర్త మౌతుంది. పాకకేసి నడుస్తోంది. సామానంత సర్ది జీపులోకి చేర వేస్తున్నారు. పెద్ద కర్ర పెట్టిని, ఆ ముగ్గురూ జీప్‌లో ఎక్కిస్తున్నారు. కుండలు చెంబులు. షూజా పెద్ద బంగళాలోకి పట్టుకుపోతున్నాడు. ప్రయాణానికి సిద్ధంచేస్తున్నట్లుగా వుంది.

"లేవండి."

"ఎక్కడికిః"

"ఇంటికి".

పక్కచుట్ట, బాగ్ లోపలపెట్టారు. షూజా బట్టలు మార్చాడు. బనీన్ తొడుక్కున్నాడు. టోపీ పెట్టుకున్నాడు. మధు లాల్చీ, పైజామా వేసుకున్నాడు. అతని మొహం తేటగా వుంది. ఏదో మార్పుంది. అవును. గడ్డం చేసుకున్నాడు నున్నగా, ఆకుపచ్చగా మెరుస్తోంది గడ్డం. అదుగో గడ్డకింద ఆ మచ్చ, అది కనబడకుండా గడ్డం పెంచాడాః ఏమో ఎవరికి తెలుసుః బుట్టనిండా రకరకాలరాళ్ళు. మరో బుట్టల్లో ప్లాస్టర్ చిత్రం—వెనకసీటంతా సామాన్లు సర్ది పొయ్యాయి. షూజా వెనకాల ఎక్కి, పెట్టెలపైన కాళ్ళతో నొక్కి కూర్చున్నాడు.

ఔరంగాబాద్ చేరుకునేప్పటికి పదకొండైంది. ఏదో ఇంటికి వొచ్చారు. దోవలో పత్రిక కొన్నాడు మధు.

"చదువుకుంటూ వుండండి. ఇప్పుడే వొస్తాను." అని జీప్‌లో షూజాతో వెళ్లాడు. పత్రికలో విషయాలు మరో లోకం వార్తలలా గున్నాయి. తనకి వాటితో సంబంధంలేదు. చదవా లని లేదు కళ్ళుమూసుకుని పరుంది. లేచేప్పటికి పన్నెండైంది, వాళ్లొచ్చారు. ముగ్గురూ హోటలు కెళ్ళి భోజనం చేశారు. అక్కడనుండి బండిలో స్టేషన్‌కి వెళ్ళారు.

ప్లాట్‌ఫారం చివరికి వెళ్ళారు. అక్కడ జనం లేదు. ఇంకా చివరికి, ప్లాట్‌ఫారం దాటారు. చెట్టు నీడలో నుంచున్నారు.

"రాత్రి ఎల్లాగో ప్రవర్తించాను కదూః"

నవ్వేతాడు.

"హిస్టీరియా" అన్నది తనే.

మాట్లాడడు.

"మనుషుల్ని ఎవ్వరూ అర్థంచేసుకోరు; అవునా?"

"ఎవ్వరూ అర్థంచేసుకోపోతేనే ఇంత బాధపడతాం. అర్థం చేసుకుంటే ఇంకెంత బాధపడతామో!" అన్నాడు. జాలేస్తుంది. ఇది వరకెన్నడూ చూడని, వికాసం. ఒక తేజస్సు అతని మొహంలో అస్పష్టంగా మెరుస్తోంది. కళ్ళ వెనక నీరూరినట్లు. తడి మసలుతోంది. కళ్ళల్లో ఎర్రచారలు తీర్చి వున్నాయి.

"రాత్రి నాకు బాగా నిద్రపట్టేసింది. నువ్వు నిద్రపోలేదు. కళ్ళు ఎర్రగా వున్నాయి."

"నిన్నరాత్రి సజీవుడనై వున్నాను."

"అంటె?"

"రైలొస్తోంది."

అవును, రైలుపొగ కొండ వెనక పాకుతోంది,

ముందు పట్టాలు అదురుతున్నాయి. జనం ముందుకి పరుగెడుతున్నారు, తను, అతను జనంలోకి వేగంగా నడిచారు. రైలు నిలిచింది. ఆడాళ్ళపెట్టెలో ఖాళీగా వుంది. తనని ఎక్కమన్నాడు. ఎక్కింది. బట్టలసంచీ, పక్కచుట్ట అందులో పడేశాడు ఘూజా. అతను తన పెట్టెముందు నిలబడ్డాడు.

"రైలు కదిలే వేళైంది. ఎక్కరాదు?"

"ఫరవాలేదు. ఒకవిషయం చెప్పనా?"

"ఏమి టది?"

తన వక్షంకేసి తీక్షణంగా చూస్తున్నాడు. పమిట సర్దుకుంది,

"నన్ను క్షమించాలి"

"ఎందుకు?"

"రాత్రి ఒక అపచారం చేశాను."

గుండెలు కొట్టుకుంటున్నాయి. ఆ ఉదయం తను లేవగానే, వొంటికేసి చూసుకుంది. ఎందుకో తెలుస్తోంది,

"చెప్పు"

"మీకు వేడినీళ్ళల్లో నిద్రమందు కలిపిచ్చాను."

"అందుకనే బాగా నిద్రపట్టేసింది. మేలుకోవాలనుకున్నా సాధ్యం కాలేదు. ఎందుకు?"

"కదలకండా, నిశ్చలంగా వుంటారని."

"రైలు కదిలే సందడి వినబడుతోంది. షూజా పక్క పెట్టెలో ఎక్కాడు. రైలు కదుల్తోంది

"నువ్వెక్కు."

నవ్వుతూ నిలబడ్డాడు, రైలు వేగం పెరిగింది. ఎక్కడేం? ప్లాట్‌ఫారం మీద నిలబడి నవ్వుతున్నాడు. అదేమిటి?

చెయ్యి వూపుతున్నాడు, దూరంగా, పసివాడిలాగై పొయ్యాడు.

ఏదో స్టేషన్‌లో ఆగింది రైలు. షూజా పెట్టెదగ్గర కొచ్చాడు.

"అయ్యగారు రాలేదేం?"

"వారెటో వెడతారుట. మిమ్మల్ని దింపి రమ్మన్నారు. టిక్కట్లు నా దగ్గ రున్నాయి.

"ఏ వూరుట?"

"నాకు చెప్పలేదు."

రైలు కదిలింది. పక్క పరుచుకుని పరుంది, జ్ఞానసుందరి. తనలో జ్ఞానంలేదు. సౌందర్యంలేదు. పేరులో రెండూ వున్నాయి. అందమైనపేరు. నిద్ర పట్టేసినట్లు తెలుస్తూంది. ఇంక తెలవడం లేదు.

* * *

చెల్లెలిగా రింటికి చేరుకునేప్పటికి ఉదయం తొమ్మిదైంది. మరోబండిలో వెడతానని షూజా స్టేషన్‌లో దిగడ్డాడు. ఇంటి దగ్గర నౌకరు లాల్‌గిరి వున్నాడు.

"అమ్మగా రేరి?"

"అమ్మ మీనాక్షిగా రింటి కెళ్ళింది" అంటూ మధుర భక్తి

పరుగెత్తుకొచ్చి ఆమె వొళ్ళో కూర్చుంది. మధురంని కౌగలించు కుంది. అప్రయత్నంగా కళ్ళమ్మట నీరు కారుతున్నాయి.

"అంతా బాగున్నారమ్మా?" ఏడ్చేస్తోంది. మధురం ఏడుపు ఆపుకుని, నీళ్లు తుడుచుకుని నవ్వుతోంది. రెండు జడలు. ఎర్రగాను పల్చటిమొహం, పెద్దకళ్ళు మధురం ముద్దుగా వుంటుంది.

"నాన్నేడీ?"

"వస్తాడు."

"ఏడీ? అమ్మని పిల్చుకొస్తా." మధురం పరుగెత్తింది. స్నానాని కెళ్ళింది జ్ఞానసుందరి. స్నానంచేసి కొత్త చీర—పసుపు పచ్చటి. ఎర్రబోర్డర్ ఖద్దరుది కట్టుకుంది.

"ఆయ నేరీ?"

వెనక్కి తిరిగింది. చెల్లెలు నాగరాజ్యలక్ష్మి. ఆమెని కౌగ లించుకుంది. అల్లా నాలుగు నిమిషా లుండిపొయ్యారు. మధురం హాల్లో గంతులేస్తోంది. సంగీతం పాడుతోంది.

"రాలేదా?"

"లేదు."

నాగరాజ్యలక్ష్మి ఏడ్చేపింది.

"చూశావా?"

"మూడురోజు లున్నాను."

"ఎల్లా వున్నారు?"

"క్షేమంగా వున్నాడు."

"మరి రాలేదేం?"

ఏం సమాధానం చెప్పాలి? చెల్లెలికేసి పరీక్షగా చూపింది. ఆమెను చూసి నాలుగైదు నెలలైంది, కాస్తంత లావెక్కినట్లుంది. మొహం వాచినట్లుంది. కళ్ళకింద గీతలు, వాడిన ముడి. ఎర్ర రాళ్ళదుద్దులు, మెళ్ళో కొత్త పగడాలదండ.

"ఈ మధ్య చేయించావా?"

కళ్లు తుడుచుకుంది.

"మీనాక్షి కొంది. నన్నూ కొనమని చంపింది. కాదనలేక పొయ్యాను. ముందిది చెప్పు. ఆయనేమైనట్లు—?"

జ్ఞానసుందరి చెప్పడం మొదలెట్టింది. ఏం చెప్పాలో, ఎట్లా చెప్పాలో. రోజల్లా రైల్లో అనుకున్నవి చెబుతోంది. చూసిన యాత్రా స్థలాలు, బొంబాయిలో చెల్లెలి ఉత్తరం రావడం, అజంతాలో మధుని చూడ్డం, స్నేహితబృందంలోంచి తాను విడిపోయిన వుదంతం. ఘాజా ఆధారంగా. అతను ప్రతిమ చెక్కడం—

"ఆ రాత్రి నిద్రపట్టేసింది. మొన్నాడు చూశాను, ఆ కుర్రాడిని నిలబెట్టి, కొలతలు కొలుస్తున్నాడు. నా కప్పుడర్థం కాలేదు."

మర్నాడు ఎల్లోరా రావడం. పాకలో మకాం. సూర్యాస్తమయం—

"అలిసివున్నానేమో—నిద్రపట్టేసింది."

నల్లపిల్ల నగ్న దృశ్యంగురించి విడిచి పెట్టేసింది. అసలు ఆ పిల్లవిషయమే చెప్పలేదు. ఎల్లోరాగుహలు చూడ్డం, అక్కడి శిల్పాలనిగురించి రాళ్ళనిగురించి అతను చేసినవర్ణన చెప్పింది. మర్నాడు పెద్దవర్షం-తను పాకలోనే వుండిపోయింది, అతను వర్షంలో తడిసి వొచ్చాడు. తనకి జ్వరం వొచ్చింది.

"ఏదో మందు వేడినీళ్ళలో కలిపిచ్చాడు—బాగా నిద్ర పట్టేసింది. ఉదయానికి నయమైంది."

"చెక్కడం ఏమిటి?"

చెల్లెలు కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా చిట్లించినప్పుడు మరీ అందంగా వుంటుంది. ఎత్తు మరో రెండంగుళాలు వుండి వుంటే, నిజంగా చెల్లెలు ఎల్లోరాలో నదీసుందరిలా గుంటుంది.

"రాతిమీద శిల్పం చెక్కుతాడట. ఒక పురుషుడు కూర్చున్నట్లు—అంతవరకూ చూశాను."

"ఆయనకీ శిల్పం ఏమిటి?"

"ఏమో, అక్కడెవరో ఆస్ట్రేలియాదొర వాకాయన దొరికాడుట. అతన్ని చూసి నేర్చుకున్నాడట."

ఇం కేముంది? మొన్నాడు ప్రయాణం. తన కేం తెలుసు?

అతనూ వొస్తా డనుకుంది. రాలేదు. దిగడిపొయ్యాడు. షూజాని సాయంగా పంపించాడు.

"వా డేడీ?"

"తిరుగు రైల్లో వాళ్ళవూ రెళ్ళిపోతాడుట."

"ఉ త్తరం వ్రాయలేక పొయ్యావా?"

"టెలిగ్రాం ఇప్పించమన్నా. తిరగ్గొట్టేశాడు."

"ఎందుకు?"

"ఎందుకో మరి."

"ఇం కేం చెప్పారు?"

"కంగారు పడొద్దను. వారంలో వొచ్చేస్తాను అవి చెప్ప మన్నాడు."

"లే చెడుతూ మొగుడికి చద్దికూడు ఇష్టమని చెప్పిందిట." అన్నది నాగులు.

తనకీ వో సామెత జ్ఞప్తికొస్తోంది_ఎక్కడా దొరక్కపోతే. అక్క మొగుడే దిక్కట - ఎటొచ్చీ, ఇప్పుడు చెల్లెలి మొగుడుతనకి దిక్కు కాలేదుగా.

"ఎక్కడి కెళ్ళి వుంటా రంటావ్? అసలు వొస్తారంటావా- నువ్వెల్లా విడిచి వొచ్చావే?"

సమాధానం ఏం చెప్పాలో తెలీదు.

"ఇంక రైల్లోంచి దూకాలి."

"నవ్వింది నాగులు.

"నే అనుకోడం. కలకత్తా వెళ్ళివుంటాడని."

"ఎందుకు?"

"అక్కడేదో శిల్పాలపోటీ ఏర్పాడు చేశారుట. తను చెక్కినవి అక్కడికి తీసుకెడతాడేమో. ప్రతిమని కర్రపెట్టెలో పెట్టడం చూశాను."

ఇంకేమీ అడగలేదు. ఆ రోజు గడిచిపోయింది. జ్ఞానసుందరికి నిద్రపట్టలేదు. మధురంని దగ్గరగా లాక్కుని పరుంది. తన పోలి కెక్కడుంది! మర్నాడు గడిచిపోయింది. చెల్లెలు కలకతాలో

అన్నయ్యకి ముఖ్యప్రాణ్ కి వ్రాసింది. అక్కడ కనిపించలేదని టెలిగ్రాం వొచ్చింది. అన్నయ్యే వొస్తున్నాడుట.

వొచ్చాడు. సంగతులు తెలుసుకుని మళ్ళా కలకత్తా ప్రయాణం అయ్యాడు. నాలుగు రోజులు గడిచాయి. మధుసూధనం జాడలేదు. చెల్లెలి ఆందోళన ఎక్కువవుతోంది. రాత్రి తోటలో చెట్టుకింద కూర్చుంది. తనూ వెళ్ళింది. దీపం లేదు. చంద్రుడులేడు. చీకటిగా వుంది. నక్షత్రాలు స్వచ్ఛంగా మెరుస్తున్నాయి.

"ఇంకేం జరిగింది?"

ఏం జరుగుతుంది? ఏమి టా ప్రశ్న?

"ఏం జరుగుతుంది? అసలు నాతో సరిగ్గా మాట్లాడండే. తిరగడం, రాళ్లు పోగుచెయ్యడం, చెక్కడం. గడ్డం. పెంచేశాడు.... స్వేచ్ఛగా."

స్వేచ్ఛగా అన్నందుకు పెదవికొరుక్కుంది—నవ్వొస్తుంది. తనకి దిగులులేదేం? చెల్లెలికి తన మాటలో నమ్మకం కుదిరినట్లు లేదు.

"కలకత్తా వెడతాను. చాలారోజులైంది." అన్నది తాను. అల్లా ఎందుకంది? అనకూడదు. కలకత్తాలో మధుసూదనం వుంటే?

"నువ్వెడితే ఎట్లా-నేనేం కాను?"

"పోనీ వెళ్ళనులే."

రెండురోజుల తర్వాత, ఉదయం ఎనిమిదింటికి బండిలో దిగాడు మధుసూదనం. మనిషివాలకం వేరు. పాంట్. కోటు, కళ్ళజోడు—గడ్డంచేసుకున్నాడు. బండిలోంచి పెద్ద కర్రపెట్టె దించాడు బండివాడు. నాగరాజ్యలక్ష్మి, నవ్వుతూ ఆహ్వానించింది.

"క్షేమంగా వచ్చారా?"

మధురభక్తి. నాన్నని కౌగిలించుకుంది. ఏడుస్తోంది.

'ఏడు పెందుకే—వెర్రిపిల్ల.'

స్నానంచేశాడు. టిఫిన్ తీసుకున్నాడు.

"ఎక్కడనుండి రావడం?"

"ఆఫీసు కెడతాను. ఆ పెట్టెమాత్రం ఎవరూ తియ్యకండి."

"ఏం?"

సమాధానంలేదు. అతను వెళ్లాడు. అమ్మాయి స్కూలు కెళ్ళింది. మధ్యాహ్నానం భోజనంచేసి, మళ్లా ఆఫీసు కెళ్లాడు మధు సూదనం. అత డొచ్చాడు కనక, తనింక రాత్రిబండికి కలకత్తా వెడతా నంది చెల్లెలితో. సాయంత్రం నాలిగింటి కొచ్చేశాడు మధు.

రెండురోజులు కాంప్ వెళ్ళిరావాలిట—సామాన్లు సర్దుకుం టున్నాడు. పత్రికొచ్చిందా అని అడిగాడు.

ఇంకా రాలేదన్నది చెల్లెలు.

"ఈ పూటేగా వస్త—అప్పుడే కాంపా!"

అత నేమీ మాట్లాడలేదు. ఐదింటికి బయలుదేరి వెళ్లాడు. తను మళ్లా కలకత్తా ప్రయాణం విషయం ఎత్తింది చెల్లెలితో. అతను కాంప్‌నుంచి వొచ్చింతర్వాత వెళ్ళొచ్చునంది.

ఆ రాత్రి గడిచిపోయింది. మర్నాడు సాయత్రం ఆ పెట్టె గురించి అడిగింది.

"పెట్టెలో ఏముందో—ఎందుకు తెరవకూడదు?" అన్నది నాగులు.

"నే నూహించగలను. అందులో రాతివిగ్రహం వుంటుంది- తీస్తే ఏమన్నా పగులుతుందని కాబోలు."

"అంత చూస్తేనే పగిలిపోతుందా-గాజుదికాదుగా."

"చూడొద్దంటే చూస్తాంగదూ—అందుకని మనం చూసేదీ లేనిదీ పరీక్షచేద్దామని అల్లా అన్నాడు కాబోలు" అన్నది జ్ఞాన సుందరి. తనిట్లాగనడం చెల్లెలికి నచ్చినట్లులేదు. మొహం చిట్లించింది.

"వారి వుద్దేశ్యాలన్నీ బాగానే పసిగడుతున్నావు" అంది చెల్లెలు.

తనకి కోపం వచ్చింది.

"అంటే?"

"ఏకాంతంగా పరిశీలించి, మనస్సు ఎట్లావుండేదీ వ్యాఖ్యానం చేసే అనుభవం...."

"ఏంమాటలవి నాగూ?"

"మీరు గడపొచ్చు-నే అనకూడదు—పెళ్లాన్నేగా!"

"ఊరుకో. అట్లాగంటే ఇక్కడుండను. ఈ పూటే వెళ్ళి పోతాను."

"ను వెక్కడ కెడతావులే!"

అఁయ్ అని కసిరింది. ఎంతమాటంటె అంతా అనేస్తోంది అక్కనేనా లేకుండా.

"నే నిప్పుడే వెడతాను."

అని జ్ఞానసుందరి, దొడ్లో ఆరేసిన బట్టలు తీస్తోంది. తన పెట్టెమూత తీసి అందులో బట్టలు లుంగచుట్టి పడేస్తోంది. గడియారం నాలుగు గంటలు కొట్టింది.

"పెట్టెలో ఏముందో చూసి వెడుదువుగానిలే."

"నాకేం చూడాలనిలేదు. మీరు మీరు ఏమన్నాకండి."

పక్కచుట్ట సర్దుకుంటోంది.

"అందులో ఏముందో తెలుసుకాబట్టే, నీకు చూడాలని లేదు" అన్నది చెల్లెలు.

"అను, అను, ఇష్ట మొచ్చినట్లు అను."

"ఇప్పు డేమన్నానూ!"

చరచరా గదిలో కొచ్చింది జ్ఞానసుందరి. అట్లకాడ పట్టుకొచ్చి పెట్టెకి చుట్టూకొట్టిన మేకులు పైకిలాగుతోంది. గబగబ ఒక్కొక్కటే పూడ పెరుకుతోంది. మూల మరో రెండు వుండిపొయ్యాయి. బలంగా పైకి నొక్కిపెట్టి లాగుతోంది. పట్టుజారి మేకు వొంకరోయి చేతి వేలికి గుచ్చుకుంది. రక్తం వొస్తోంది బొటబొట. చెల్లెలు గుడ్డపేలిక తెచ్చి కట్టు కడుతోంది. తను విదిలించేసింది. రక్తం బొట్లుచింది ఆమె మొహాన పడ్డాయి.

"ఇప్పుడు చూసుకో."

అని మూతలాగి గిరవాటేసింది. పెట్టెనిండా పాతగుడ్డలు. దూది, రంపపొట్టు. చెత్తకాగితాలు పైన, చుట్టూ కప్పివున్నాయి. ఒక్కొక్కటే పైకి లాగుతోంది. అన్నీ తీసేసింది. లోపల రాతి

విగ్రహాన్ని పైకి లేవదీసి మధ్యనున్న గుండ్రని బల్లమీద నుంచో బెట్టారు ఇద్దరూ కలిపి.

అది మూడున్నర అడుగుల ఎత్తైన రాతి శిల్పం. మోకాళ్ల మీద కూర్చున్న పురుషుడు. వుంగరాలజుట్టుతల- మోకాలు. మోచెయ్యి వంకరలు తిరిగివున్నాయి. దీనంగా చూస్తున్నట్లు,కళ్ల పైన దట్టంగా కనబడే కనుబొమ్మలు, ప్రక్కన ఒక స్త్రీ నిలబడి వుంది. ఒకచెయ్యి. అతని మెడమీద బిగించి వుంది. రెండోచెయ్యి పైకిలేచి వుంది. చేతిలో గరిటెలాంటిది— ఇనుముది— వుంది. ఆమె మెడలో నగలు లేవు— ఏ ఆభరణమూ లేదు. గాజులు లేవు—నడుంకిచుట్టుకుని పరికిణీలా అంచులు, మడతలు తీర్చినట్లుగా చిత్రితమైన స్త్రీ మూర్తి.

స్త్రీ ప్రతిమ మొహంలో గాంభీర్యం, గర్వం వున్నాయి. మూతిబిగించి కాఠిన్యాన్ని సూచిస్తోంది,

పురుషుణ్ని బానిస చేసి, తానుపొందిన స్వేచ్ఛతో విర్రవీగుతున్నట్లు స్ఫురించే శిల్పం అది. ఇద్దరు పరీక్షగా చూశారు. చెల్లెలు కళ్ళంట నీరు తిరుగుతోంది. ఆమె పెదవులు వొణుకుతున్నాయి. వేళ్లు వొణుకుతున్నాయి. అవి కదలకుండా. చేతులు బిగించి చీర కొంగులో దాచింది.

"నీ మొహామే."

అన్నది చెల్లెలు. తనకి భయమేసింది. అవునేమో అనిపిస్తోంది, ఆ శిల్పంలో ఒక లోపం తనకి స్ఫురించింది. పురుషుణ్ని బానిస చేసి స్వతంత్రం పొందిన స్త్రీ మూర్తిని చిత్రించడం వుద్దేశమైతే, ఆమె మెడలో బోలెడన్ని ఆభరణాలుండాలి. సంపద సూచించాలి. ఇవి ఆ చిత్రంలో లేవు— తనకీ ఆభరణాలు లేవు. అదొక పోలిక- తనకి ఆ రాత్రి విగ్రహం దిచ్చి, పక్కచుట్టమీద ఆనించి కూర్చోబెట్టి, దీపం మొహం ముందు వుంచి, ఆమె స్వరూపాన్ని రాత్రంతా చెక్కుతూ గడిపి వుంటాడు. లేకపోతె తన పోలికెట్లా వొస్తుంది?

తనపోలికే వుందని ఎందు కనుకోవాలి? అది భ్రమ. తను

ఆ శిల్పాన్ని ప్రేరేపించిం దనుకోవడంలో తృప్తి, అహంవున్నాయి కాని చెల్లెలు కూడా అల్లాగే అంది. ఈ విషయంలో స్త్రీ ఎప్పుడూ పొరబడదు.

"అవునా?"

"ఏమిటవును?"

"మూడు నిద్రలుచేసిన ఫలితం."

"ఛ. ఛ! ఎన్నిసార్లు చెప్పను? నీకు మతిపోయింది.... అసలు ఏమీ-ఏదీ.... జరగందే...."

"ఆయనరాగానే వెళ్ళిపోతానని ఎందు కంటావు....?"

చరచర దొడ్లో కెళ్ళింది నాగులు. మళ్లా వొచ్చింది. చీర కొంగులోంచి చెయ్యి బైటకి లాగింది. చేతులో సుత్తితో గబగబ శిల్పంమీద కొడుతోంది చెల్లెలు. తనడ్డపడింది. వారించింది. సుత్తి రెండో చేతిలో తీసుకుంది. మళ్లా స్త్రీ ప్రతిమమీద కొడుతోంది. గట్టిగా రెండు చేతులు పట్టుకుంది. ఆమె విదిలించివేసింది. వెనక్కి తిరిగి మరో దెబ్బ కొట్టింది.

"వొద్దు. వొద్దు. నన్ను కొట్టు— నా నెత్తి పగలగొట్టు. దాన్నొద్దు—నాగు—నాగు...."

మరో బలమైన వేటుతో మొత్తంగా బొమ్మ కింద కూలింది. విరిగి ముక్కలైంది. స్త్రీమూర్తిచెయ్యి వూడింది, చేతిలో గరిట దూరంగా పడింది. పురుషుడి తల పగిలింది. స్త్రీమూర్తినడుం విరిగింది. జ్ఞానసుందరి నడుంపైన రెండు చేతులూ బిగించి, కింద పడిపోయింది—నడుం విరిగినదానికి మల్లె.

హాల్లో అడుగులచప్పుడు. జోళ్లు విడిచిన చప్పుడు.

"నాకు తెలుసు."

అని ఒక పురుషకంఠం. మధుసూదనంది. చెల్లెలు మూలగా మంచంమీద పడివుంది. మొహాన కొంగు కప్పుకుని ఏడుస్తోంది. అతనుహాల్లో కెళ్లాడు. మళ్ళా వొచ్చాడు. పగిలిన ముక్కల్ని ఏరుతున్నాడు.

"ఇన్నిరోజు లుండడం విశేషమే." అంటున్నాడు. ఎవ్వరూ మాట్లాడరు.

"మీ అక్కయ్య పోలికను శిల్పంలో చిత్రించగల ప్రతిభా శాలినైతే కళాప్రపంచం బ్రహ్మరథం పట్టును."

నౌకరు లాల్‌గిరి పత్రిక తెచ్చాడు. మధుసూదనం ఆత్రుతతో పుటలు తిప్పుతున్నాడు. చదువుతున్నాడు. పూర్తయింది.

"ఇదిగో పత్రికలో చూడు" అని చెల్లెలికి పత్రిక అందిచ్చి చదవవల్సిన భాగంవైపు వేలితో చూపుతున్నాడు. కొంగు కళ్ళకిందికి లాగి, వొణికిపోతున్న చేతులతో పత్రిక చూస్తోంది. పత్రిక చేతిలో వుండడంలేదు. అతను పట్టుకున్నాడు.

"చదువుకో."

చదివింది, తనూ లేచింది. దగ్గరగా వెళ్ళి మంచం బద్దిమీద కూర్చుంది. పత్రిక చూస్తోంది. ఆమెకేసి అతను దీనంగా చూస్తున్నాడు. చూపుతప్పించి చదివింది.

"వొస్తువు వుదాత్తమైంది కాకపోయినా. శిల్పంలో చూపిన నేర్పుకి మధుసూదనంగారి 'నేటి స్వేచ్ఛ' అనే కంచులో పోసిన శిల్పానికి వెండి పతకం లభించింది. ఫైనార్ట్ సొసైటీవారి బంగారు పతకం...."

నాగరాజ్యలక్ష్మి లేచింది. తనని గట్టిగా కౌగలించుకుంది. ఏడుస్తోంది.

"నన్ను... నన్నొదిలి వెళ్ళకు...."

మధుసూదనం నవ్వుతున్నాడు.

"ఇదెల్లానూ భగ్నమౌతుందని తెలిసే. ప్లాస్టర్ శిల్పంపూర్తి చేసి పూనాలో కంచులో పోతపోయించి కలకత్తా ప్రదర్శనకి పంపించాను. ఇంక ఇద్దరూ స్వేచ్ఛగా సాగించండి. నవ్వో ఏడుపో?"

వెళ్ళాడు. నాగరాజ్యలక్ష్మి నవ్వుతోంది. లేచింది. అతని వెనకాలే వెళ్ళింది. బైట మధురభక్తి పాడుకుంటూ రావడం వినబడుతోంది.

మొహాన్ని రెండుచేతుల్లో దాచుకుంది జ్ఞానసుందరి. అది ఏడుపో నవ్వో తనకే తెలియదు.

———